కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :165 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | ఆదివారం 18-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

దసరా పండగ వేళ అటవీ శాఖ హెచ్చరిక



హైదరాబాద్,దసరా పండుగ సందర్భంగా మండపాల వద్ద పాలపిట్టను ప్రదర్శిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తెలంగాణ అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. పండుగ సంప్రదాయాల పేరుతో పాలపిట్టను పట్టుకోవడం, బంధించడం, ప్రదర్శించడం లేదా ఇతరత్రా చట్టవిరుద్ధంగా వినియోగించడం చేయరాదని స్పష్టం చేశారు. వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా పాలపిట్టను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

మండపాల నిర్వాహకులకు అవగాహన

దసరా సందర్భంగా పాలపిట్టను మండపాల వద్దకు తీసుకువచ్చి ప్రదర్శించే చర్యలను నివారించేందుకు అటవీ శాఖ అధికారులు ప్రత్యేకంగా అవగాహన పోస్టర్లను రూపొందించారు. మండపాల నిర్వాహకులకు వీటి ద్వారా సూచనలు అందిస్తూ, పక్షులను పట్టుకోవడం, బంధించడం, ప్రదర్శించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని కోరుతున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

పాలపిట్టను కాపాడటం మనందరి బాధ్యత

జీవవైవిధ్య పరిరక్షణలో పక్షులు కీలక పాత్ర పోషిస్తాయని అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు. పండుగ సంప్రదాయాలను పాటించే క్రమంలో పక్షులకు హాని కలిగించే చర్యలకు పాల్పడకూడదని సూచించారు. వన్యప్రాణుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

సమాచారం అందించాలని విజ్ఞప్తి

దసరా మండపాల వద్ద ఎవరైనా పాలపిట్టను ప్రదర్శిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు. పక్షులను బంధించడం, వాటి స్వేచ్ఛకు భంగం కలిగించడం వంటి చర్యలను ప్రోత్సహించవద్దని సూచించారు.

బంజారాహిల్స్ పోలీసులకు పోస్టర్లు

పాలపిట్ట సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించే కార్యక్రమంలో భాగంగా శనివారం అటవీ శాఖ అధికారులు బంజారాహిల్స్ పోలీసులకు ప్రత్యేక పోస్టర్లను అందజేశారు. పండుగ సమయంలో ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు, పాలపిట్ట పరిరక్షణకు సహకరించాలని కోరారు.

కెసిఆర్ ఫామ్‌హౌస్‌పై ఎల్ఎనినో ప్రభావం పడదా?: చామల




హైదరాబాద్: మాజీ సిఎం కెసిఆర్ ఫామ్‌హౌస్‌కు మాత్రం ఎల్ఎనినో ప్రభావం ఉండదా? అని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. కొండపోచమ్మ సాగర్ నుంచి ఎర్రవల్లికి నేరుగా నీటిని తరలిస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నదే నీటి కోసమేనని తెలియజేశారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటా దక్కాలని, కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిగా నిర్మించామని కెసిఆర్ భావిస్తున్నారని చామల పేర్కొన్నారు. ప్రతి ఎకరానికీ నీరు అందుతోందని కెసిఆర్ అనుకుంటున్నారని, అయితే ఆయన ఫామ్‌హౌస్‌లోని మూడు ఎకరాల్లో తవ్విన బావికి నీరు అందుతోందని ఎద్దేవా చేశారు. సుమారు 300 ఎకరాల్లో పూర్తి రాయితీతో డ్రిప్ పరికరాలను ఏర్పాటు చేసుకున్నారని, రాష్ట్రంలోని రైతులు నీటి కొరతను ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో కెసిఆర్ ఫామ్‌హౌస్‌కు మాత్రం నీటి కొరత ఉండటం లేదని చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.

బీజేపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు అలవాటు పడింది..



హైదరాబాద్, అక్టోబర్ 17: బీజేపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు అలవాటు పడిందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఈరోజు(శనివారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. బీజేపీ విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రతిసారీ విదేశీ శక్తులను తెరపైకి తెస్తోందని మండిపడ్డారు. చైనా భూ ఆక్రమణపై మాట్లాడే దమ్ము మోదీకి లేదన్నారు. రోహింగ్యాల పేరుతో దేశ ప్రజల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. దొరికితే దొంగ అన్నట్లుంది బీజేపీ తీరు అంటూ మండిపడ్డారు. ఈడీ దాడులు కేవలం ప్రతిపక్ష పార్టీ నేతలపైనే ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు.చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎన్నిక ప్రక్రియ నిబంధనలు ఎందుకు మార్చారని, కమిటీలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌ను ఎందుకు తొలగించారని పీసీసీ చీఫ్ నిలదీశారు. చీఫ్ ఎలక్షన్ కమిషన్‌గా జ్ఞానేష్ కుమార్ ఎన్నికైన రోజే ప్రమాదాన్ని గురించి రాహుల్ గాంధీ హెచ్చరించారని గుర్తుచేశారు. 'మీరు ప్రజల మద్దతుతో గెలవలేరు.. అందుకే ఓటు దొంగతనానికి పాల్పడ్డారు' అంటూ బీజేపీపై విరుచుకుపడ్డారు. పెద్ద రాష్ట్రాలలో ఓట్ల దొంగతనం ఎక్కువగా జరుగుతోందని అన్నారు.గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో సీపీఎం మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నామని మహేశ్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో సీపీఎం కలసి పనిచేస్తుందని చెప్పారు. నేటి సీపీఎం పొలిట్‌బ్యూరో మీటింగ్ తర్వాత వారి నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటిస్తారన్నారు. ఇండియా కూటమిలోని అన్ని పార్టీల మద్దతు కూడగడుతామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

నువ్వు మోటార్లు నడిపి ఉంటే వరంగల్‌కు కరువు ఎక్కడిది..



హైదరాబాద్, రైతులను కానీ, ప్రజలను కానీ మీ సావు మీరు సావండి అని రేవంత్ రెడ్డి అంటుండని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఏదైనా పైసలు పెట్టి కొనొచ్చు కానీ నీళ్లు కొంటమా..? నీళ్లను కొనలేము అంటున్నడు. మరి అంత ప్రాధాన్యత కలిగిన నీళ్ల విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నావ్. నేను మొదటి నుంచి చెబుతున్నా.. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు అని.. దానికి ఈ రూంలో ఉన్న జర్నలిస్టులే సాక్ష్యమన్నారు.పాపం చనిపోయిన మా పెద్ది సుదర్శన్ రెడ్డి కూడా పోరాడిండు. దేవాదులలో నీళ్లొస్తున్నాయి.. 10 మోటార్లు నడవాల్సిన చోట మూడే మోటార్లు ఎందుకు నడుపుతున్నవ్.. ఎల్ఎనినో వస్తుందంటున్నరు..3 మోటార్లు ఎందుకు నడుపతున్నవ్.. 10 మోటార్లు నడుపు.. నీళ్లు ఎత్తు. వరంగల్ జిల్లాలోని రిజర్వాయర్లు నింపు.. చెరువులు నింపు అని నేను ఇక్కడ ప్రెస్‌మీట్‌లో మాట్లాడినా.. వరంగల్ పోయి మాట్లాడినా.. మా పెద్ది సుదర్శన్ రెడ్డి కూడా మాట్లాడారు. మా వరంగల్ జిల్లా నాయకులంతా మాట్లాడారు.. ఎత్తావా..? నువ్వు.. మరి ఆ రోజు నీళ్లు ఎందుకు ఎత్తలేదు.. చుక్క నీళ్లు రాగానే దేవాదులలో నీల్లు ఎత్తాలనే సోయి నీకు ఎందుకు లేదు. ఎల్ఎనినో వస్తుందని ప్రపంచమంతా జాగ్రత్తపడుతుంటే నువ్వు ఎందుకు 10కి 10 మోటార్లు నడుపలేదని హరీశ్ రావు ప్రశ్నించారు.మిస్టర్ రేవంత్ రెడ్డి అని నేనడుగుతున్నా.. నువ్వు 10కి 10 మోటార్లు 24 గంటలు నడిపుంటే ఇవాళ వరంగల్‌కు కరువెక్కడిది అని హరీశ్ రావు అడిగారు. కేసీఆర్ ముందు చూపుతో సమ్మక్క బ్యారేజీని కట్టి కరువు కాలంలో సంవత్సరానికి 300 రోజులు దేవాదుల నీళ్లెత్తడానికి అనుకూలంగా ఆ ప్రాజెక్టు మేం నిర్మించినం కదా..300 రోజులు ఎత్తే అవకాశముంటే.. నువ్వు నీళ్లు వదిలిపెట్టివవు.. నువ్వు వదిలిపెడితే చంద్రబాబు ఒడిసిపట్టిండు. పట్టిసీమ ద్వారా ఇవాళ ఆంధ్రప్రదేశ్‌లో క్రాప్ హాలీడే లేదు.. కరువు లేదు.. అంతేకాదు తెలంగాణ కంటే తక్కువ వర్షపాతం ఆంధ్రప్రదేశ్‌లో నమోదైంది.. తెలంగాణలో 12-13 శాతం ఉంటే.. ఏపీలో 25 శాతం తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. కానీ అక్కడ క్రాప్ హాలీడే లేదు.. పంటలు పండుతున్నయ్.. నీకు ఆంధ్రప్రదేశ్ కంటే వర్షాలు ఎక్కువ పడ్డా నీ చేతకాని

పల్లెబాట పట్టిన పట్నం.. కిక్కిరిసిన రహదారులు!



హైదరాబాద్,దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్లేవారి సంఖ్య భారీగా పెరిగింది. కుటుంబంతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకోవడానికి నగరవాసులు పల్లెబాట పట్టారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాలతో పాటు సొంత కార్లు, బైకులలో ప్రయాణాలు చేయడంతో ప్రధాన రహదారులపై వాహనాలు బారులు తీరాయి. ముఖ్యంగా మియాపూర్ నుంచి బాలానగర్ వై జంక్షన్ వరకు ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. వాహనాలు నత్తనడకన సాగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.దసరా సెలవులు రావడంతో నగరంలోని ఉద్యోగులు, వ్యాపారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామాలకు బయలుదేరారు. ఒకేసారి వేలాది మంది రోడ్లపైకి రావడంతో ప్రధాన మార్గాలన్నీ కిటకిటలాడాయి. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లతో పాటు రోడ్లపై కూడా వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ఈ రద్దీ కారణంగా ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు సమయానికి గమ్యస్థానం చేరలేక అనేక అవస్థలు పడ్డారు.

రహదారులపై చక్రబంధం.. గంటల కొద్దీ నత్తనడక!

నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ జామ్ కారణంగా చిన్న పిల్లలు, వృద్ధులు ప్రయాణంలో నానా తంటాలు పడ్డారు. మియాపూర్, కూకట్‌పల్లి, బాలానగర్ ప్రాంతాలలో గంటల తరబడి వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నప్పటికీ రద్దీ తట్టుకోవడం కష్టంగా మారింది. పండుగ సంతోషంలో సొంతూళ్లకు వెళ్తున్న ప్రయాణికులకు ఈ ట్రాఫిక్ కష్టాలు కొంత నిరాశ కలిగించాయి.

ట్యాంక్‌బండ్‌పై అంబరాన్నంటేలా బతుకమ్మ సంబురాలు!



హైదరాబాద్, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ట్యాంక్‌బండ్‌పై అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతిబింబంగా నిలిచే ఈ పూల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లపై దృష్టి సారించింది. వేలాది మంది మహిళలు, కళాకారులు, ప్రజలు భాగస్వాములయ్యేలా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. ఈ వేడుకలకు రాష్ట్ర గవర్నర్, ప్రముఖ సినీనటుడు విజయ్ దేవరకొండ, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ప్రముఖుల భాగస్వామ్యంతో బతుకమ్మ సంబురాలకు మరింత ప్రత్యేకత చేకూరనుంది.

తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా బతుకమ్మ

బతుకమ్మ తెలంగాణ ప్రజల జీవన విధానంలో అంతర్భాగంగా నిలిచిన పూల పండుగ. ప్రకృతిని ఆరాధిస్తూ, వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, మహిళలంతా ఒకచోట చేరి సంప్రదాయ పాటలు పాడుతూ జరుపుకునే ఈ పండుగకు విశిష్టమైన చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం ఉంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలోనూ బతుకమ్మ వేడుకలు ప్రజల ఐక్యతకు, ప్రాంతీయ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచాయి. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర స్థానిక పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించడం ఈ పండుగలో ప్రధాన ఆకర్షణ. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి ఆడుతూ పాడుతూ సంబురాలు చేసుకోవడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.

ట్యాంక్‌బండ్‌పై పూల పండుగ సందడి

హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ పరిసరాలు, ట్యాంక్‌బండ్ ప్రాంతం బతుకమ్మ వేడుకలతో పండుగ శోభను సంతరించుకోనున్నాయి.పూల అలంకరణలు, సంప్రదాయ కళారూపాలు, తెలంగాణ జానపద గీతాలు, మహిళల సామూహిక బతుకమ్మ ఆటలు ఈ వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళా బృందాలు, సాంస్కృతిక కళాకారులు, జానపద కళా బృందాల ప్రదర్శనలతో తెలంగాణ కళా వైభవాన్ని చాటేలా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సంప్రదాయ బతుకమ్మ పాటలతో పాటు తెలంగాణ జానపద సంగీతం, నృత్య ప్రదర్శనలు వేడుకలకు మరింత కళాత్మక శోభను తీసుకురానున్నాయి. నగర ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు ఈ సంబురాల్లో భాగస్వాములయ్యేలా ఏర్పాట్లు చేయడం ద్వారా ట్యాంక్‌బండ్ ప్రాంతం తెలంగాణ సాంస్కృతిక వైభవానికి వేదికగా నిలవనుంది.

ప్రముఖుల రాకతో వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ

రాష్ట్ర గవర్నర్, ప్రముఖ సినీనటుడు విజయ్ దేవరకొండ, మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొనడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ప్రముఖుల భాగస్వామ్యం బతుకమ్మ పండుగకు మరింత ప్రచారం కల్పించడంతో పాటు తెలంగాణ సంస్కృతిని దేశవ్యాప్తంగా పరిచయం చేయడానికి దోహదపడనుంది. ముఖ్యంగా యువతలో విశేష గుర్తింపు పొందిన విజయ్ దేవరకొండ పాల్గొనడం ద్వారా యువతకు బతుకమ్మ పండుగ విశిష్టతను మరింత చేరువ చేయవచ్చు. సంప్రదాయాలు, ఆధునికత కలిసిన ఈ వేడుక తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని కొత్త తరాలకు పరిచయం చేసే వేదికగా నిలవనుంది.

ప్రజల సౌకర్యాలు, భద్రతకు ప్రాధాన్యం

వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు వేదిక రూపకల్పన, పూల అలంకరణలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రజల రాకపోకలు, భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. భారీగా ప్రజలు తరలివచ్చే నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, అత్యవసర వైద్య సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, మహిళల భద్రతకు తగిన చర్యలు చేపట్టడం కీలకం. అదేవిధంగా హుస్సేన్‌సాగర్ పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ వేడుకలు నిర్వహించడం ద్వారా ప్రజలకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందించవచ్చు. సంబంధిత శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేపడితే కార్యక్రమం సజావుగా సాగేందుకు వీలుంటుంది. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి చాటుతూ, ఆడపడుచుల ఆనందోత్సాహాలకు ప్రతీకగా బతుకమ్మ సంబురాలు నగరానికి పండుగ కళను తీసుకురానున్నాయి.

నా రాజకీయ గురువు కోమటిరెడ్డి కోసం తల నరుక్కుంటా..



జడ్చర్ల : పాలమూరు నీళ్ల విషయంలో వెనక్కి తగ్గేదే లేదని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. నా రాజకీయ గురువు అయిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోసం నా తలనైనా నరుక్కుంటానని, కానీ నీళ్ల కోసం గురువు తోనైనా యుద్ధం చేస్తానని, నా ప్రాంత ప్రయోజనాలే తనకు ముఖ్యమని సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం జడ్చర్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.పాలమూరుకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునేది లేదని, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోసం తన ప్రాణాలైనా ఇస్తానని, కానీ పాలమూరు నీళ్లను తరలించుకుపోతే మాత్రం సహించబోనని అన్నారు.పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకాలకు నీటి కేటాయింపుల వ్యవహారంపై తన వైఖరిని స్పష్టం చేశారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ఎత్తిపోతలకు నీటిని తరలించే ప్రతిపాదనను తాము అంగీకరించబోమని తేల్చిచెప్పారు. ముందుగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా పాలమూరుకు నీళ్లు అందించాలని, ఆ తర్వాతే డిండి ప్రాజెక్టుకు నీటిని ఇవ్వాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ హయాంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు కేవలం 60 శాతం మాత్రమే జరిగాయని ఆరోపించారు.



సంపాదకీయం

ఆదివారం 18-10-2026

గిగ్ వర్కులుగా మారుతున్న యూత్..

ప్రతి సంవత్సరం కొన్ని లక్షలు మంది డ్రిగీ పట్టాలతో బయటికొస్తున్నారు. ఇందులో కొందరు మాత్రమే మంచి ఉద్యోగాలు సాదించి ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారు. కానీ ఇలా డిగ్రీ పట్టా చేతితో పట్టుకొని.. సరైన ఉద్యోగ అవకాశాలు దొరక్కా.. ఎంతో మంది పార్ట్‌టైం జాబ్‌గా ఫుడ్ డెలివరీ జాబ్స్‌కు పరిమితమవుతున్నారు. ఇలాంటి వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది.. మరీ ఇది వారి జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది. కళాశాల నుంచి డిగ్రీ పట్టాతో ప్రతి ఏడాది కొన్ని లక్షల మంది యువత బయటకు వస్తున్నారు. ఇలా బయటకొచ్చిన ఓ గ్రాడ్యుయేట్ ఓ సాధారణ రెజ్యూమెతో ఉద్యోగాల కోసం వెతుక్కుంటూ.. సరైన జాబ్ దొరకా తర్వాతి అడుగు ఎటు వేయాలో తెలియని అయోమయంలో పడిపోతుననారు. చివరికి అద్దె బైక్‌పై ఫుడ్ డెలివరీ చేస్తూ, రోజూవారీ ఖర్చులు వెళ్లదీసుకుంటూ, ఎప్పటికైనా తాను చదివిన చదువుకు తగిన ఉద్యోగం లభిస్తుందనే ఆశతో ఎదురుచూస్తూ జీవితాన్ని గడిపేస్తున్నారు. మన దేశంలో ఏటా లక్షలాది మంది యువతీ, యువకులు ఎదుర్కొంటున్న ఈ చదువు పూర్తి కావడానికి ? సరైన ఉపాధి దొరకడానికి మధ్య ఉండే ఖాళీ వ్యవస్థలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ పరివర్తన కాలాన్ని అనుకోకుండా వదిలేయకుండా, ఒక పద్ధతి ప్రకారం డిజైన్ చేశారు. ముఖ్యంగా జర్మనీలో అమలవుతున్న డ్యూయల్ అప్రెంటిస్‌షిప్ విధానం ప్రపంచానికే రోల్ మోడల్‌గా నిలుస్తోంది. అక్కడ విద్యార్థులు సగం సమయం తరగతి గదిలో, మిగిలిన సగం వాస్తవ పని ప్రదేశంలో గడుపుతూ వేతనం పొందుతారు. సుమారు 8.3 కోట్ల జనాభా ఉన్న జర్మనీలో దాదాపు 13 లక్షల మంది అప్రెంటిస్‌లుగా ఉన్నారు. అంటే వారి మొత్తం జనాభాలో వీరు 1.5 శాతానికి పైగా ఉంటారు.భారత్‌లోనూ దీనికి సమానంగా నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ ఉంది. కానీ ఇక్కడి గణాంకాలు ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. 140 కోట్లకు పైగా జనాభా ఉన్న మన దేశంలో, 2024?25 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద నమోదైన అప్రెంటిస్‌ల సంఖ్య కేవలం 9.85 లక్షలు మాత్రమే. అంటే జనాభా నిష్పత్తి ప్రకారం చూస్తే జర్మనీ కంటే ఇది దాదాపు 20 రెట్లు తక్కువ.ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అవకాశాలు లేకపోవడం సమస్య కాదు. అధికారిక నివేదికల ప్రకారం, దేశవ్యాప్తంగా అప్రెంటిస్‌షిప్ పథకం కింద ఏకంగా 70 లక్షలకు పైగా ఖాళీలు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. సమస్య ఖాళీల కొరత కాదు, యువత వీటి కోసం దరఖాస్తు చేయకపోవడమే. 2022లో 42.8 లక్షలుగా ఉన్న దరఖాస్తులు, 2025 నాటికి ఏకంగా 4 లక్షలకు పడిపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.చదువు నుంచి కెరీర్‌కు వారధిగా నిలవాల్సిన లక్షలాది పోస్టులను నిరుద్యోగ యువత ఎందుకు ఎంచుకోవడం లేదు? అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే.. దీని వెనుక బలమైన ఆర్థిక కారణాలు కనిపిస్తున్నాయి. అప్రెంటిస్‌షిప్‌లలో సాధారణంగా నెలకు రూ.10,000 నుంచి రూ.15,000 వరకు మాత్రమే స్టైపెండ్ ఇస్తారు. దీనికోసం వేరే నగరాలకు వెళ్లి అక్కడే ఉండాలి.. పైగా ట్రైనింగ్ తర్వాత ఉద్యోగం వస్తుందన్న గ్యారెంటీ ఉండదు. దీంతో చాలా మంది దీనివైపు మొగ్గుచూపట్లేదని నివేదికలు చెబుతున్నారు.అదే సమయంలో దీనికి భిన్నంగా ఫుడ్ డెలివరీ, క్యాబ్ డ్రైవింగ్, రిటైల్ స్టోర్లలో పని వంటి గిగ్ ఉద్యోగాలు వెంటనే డబ్బును అందిస్తున్నాయి. సొంత ఊరిలోనే ఉంటూ పనిచేసుకునే వెసులుబాటు ఉండటం, దీర్ఘకాలిక ఒప్పందాలు లేకపోవడంతో కుటుంబ అవసరాలు తీర్చుకోవాల్సిన యువత అప్రెంటిస్‌షిప్ కంటే గిగ్ పనులకే మొగ్గు చూపుతున్నారు.గిగ్ వర్క్ తాత్కాలిక ఆదాయానికి, ఉపాధికి మంచి మాధ్యమమే అయినప్పటికీ.. ఇది భవిష్యత్తులో అధిక వేతనాలు, స్థిరమైన కెరీర్‌ను ఇచ్చే సర్టిఫైడ్ నైపుణ్యాలను అందించలేదు. అదే క్రమబద్ధమైన అప్రెంటిస్‌షిప్ అయితే తరగతి గది పాఠాలను పరిశ్రమ అవసరాలకు అనుసంధానించే నైపుణ్యాన్ని ఇస్తుంది. కానీ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో శిక్షణ ద్వారా కెరీర్‌ను నిర్మించుకోవడం కంటే, చేతికి వెంటనే డబ్బు తెచ్చిపెట్టే తాత్కాలిక పనుల వైపే భారతీయ యువత అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.యువత తీసుకుంటున్న ఈ నిర్ణయం వారి ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సరైనదే కావొచ్చు. కానీ లక్షలాది ఖాళీలు అందుబాటులో ఉన్నా, ఒక క్రమబద్ధమైన శిక్షణా విధానాన్ని యువత ఎందుకు కాదనుకోవాల్సి వస్తుందన్నదే అసలు ప్రశ్న. వ్యవస్థాగత విధానాలు, స్టైపెండ్ స్థాయిలు, భవిష్యత్ ఉద్యోగ భద్రత వంటి అంశాలలో మార్పులు రానంత వరకు ఈ అంతరం ఇలాగే కొనసాగే ప్రమాదం ఉంది.

మోదీ ట్రాప్‌లో కాంగ్రెస్ !



న్యూఢిల్లీ,"యుద్ధరంగానికి వెళ్లేటప్పుడు శత్రువు ఎవరో, అతడి వ్యూహం ఏంటో తెలియనంత వరకు ఏ సైన్యమూ విజయ తీరాలకు చేరలేదు."ఇది రాజకీయాలకూ వంద శాతం వర్తిస్తుంది. భారత రాజకీయ చరిత్రలో శతాబ్దానికి పైగా మూలాలున్న గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్, ప్రస్తుతం తన రాజకీయ దిశనూ, దశనూ పూర్తిగా కోల్పోయిన పరిస్థితి కనిపిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు పన్నుతున్న రాజకీయ వ్యూహాలను అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్ నాయకత్వం దారుణంగా విఫలమవుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నరేంద్ర మోదీ నిర్దేశించిన రాజకీయ బాటలోనే నడుస్తూ, ఆయన చేతిలో ఓ పకడ్బందీ కీలుబొమ్మలా మారిపోయింది. తాము వేసే ప్రతి అడుగు వల్ల పార్టీకి లభించేది లాభమా లేక రాజకీయ ఆత్మహత్యాసదృశమైన నష్టమా అన్న విచక్షణను కూడా కాంగ్రెస్ అగ్రనాయకత్వం కోల్పోయి రాజకీయం చేస్తున్నారు.

ఈసీ బూచి – లాజిక్ లేని పోరాటం

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, ఈవీఎంల పనితీరుపై రచ్చ చేస్తూ, భారత ఎన్నికల సంఘంపై , సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై బహిరంగ సమరం ప్రకటించింది. ఎన్నికల సంఘాన్ని కేవలం బిజెపి మరొక అనుబంధ విభాగంగా ముద్రవేస్తూ ప్రజల్లోకి వెళ్లేందుకు తాపత్రయపడుతోంది. ఇక్కడే కాంగ్రెస్ తన ప్రాథమిక లాజిక్‌ను మిస్సయ్యింది. ప్రజాస్వామ్యంలో రాజకీయంగా ఢీకొట్టాల్సింది బిజెపి అనే ప్రత్యర్థి పార్టీని మాత్రమే. కానీ ప్రజాస్వామ్య మూలస్తంభమైన ఎన్నికల సంఘాన్ని బిజెపి రూపంగా చిత్రీకరిస్తూ పోరాడటం ఎంతవరకు సమంజసం?. భారతీయ ఎన్నికల వ్యవస్థ అంత సులువుగా ఫలితాలను మార్చేసే లేదా ప్రభావితం చేసే బలహీనమైన వ్యవస్థ కాదనే సత్యం సగటు పౌరుడికి తెలుసు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది పోలింగ్ సిబ్బంది, బూత్ లెవెల్ ఆఫీసర్లు , వివిధ పార్టీల ఏజెంట్లు కలసి క్షేత్రస్థాయిలో ప్రక్రియను నిర్వహిస్తారు. లక్షల సంఖ్యలో ఉండే క్షేత్రస్థాయి సిబ్బంది ఏదో ఒక రాజకీయ పార్టీకి కొమ్ముకాస్తూ, ఓట్లు తీసేయడమో లేదా వేయడమో ఓ ఆదేశంతో చేయడం అసాధ్యం. అంత పెద్ద ఎత్తున అక్రమాలు చేయడం క్షేత్రస్థాయిలో సాధ్యం కాదన్న క్లారిటీ సామాన్య పౌరులకు ఉంది. కానీ, ఈ చిన్న విషయాన్ని పక్కనబెట్టి, ఎన్నికల సంఘాన్ని బూచిగా చూపిస్తూ రాజకీయం చేయడమే బిజెపి పరిచిన అసలైన ట్రాప్ . ఈ ట్రాప్‌లో పడిన కాంగ్రెస్, ప్రజా సమస్యలను వదిలేసి, ఈసీ రాజీనామాల చుట్టూ తిరుగుతూ రోజురోజుకు ప్రజలకు మరింత దూరమవుతోంది.

దక్షిణాదిన ఆదరణ లేదు.. ఉత్తరాదిన ఉనికి లేదు!

ఈ SIR ప్రక్రియ , ఈసీ వ్యతిరేక ఉద్యమాల వల్ల సామాన్య ప్రజల జీవనంలో ఎలాంటి అలజడీ లేదు. విపక్షాలు చెప్తున్న ఆరోపణలతో సగటు పౌరులు ఏమాత్రం ప్రభావితం కాలేదు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ చేపడుతున్న ఈ ఉద్యమాలకు ఎలాంటి ప్రజాదరణ లభించడం లేదు. స్థానిక నేతలు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు ఢిల్లీ వీధుల్లోకి వచ్చి లేదా రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నా, ప్రజలు వాటిని పట్టించుకోవడం లేదు. ఇక్కడొక చేదు రాజకీయ సంకేతాన్ని కాంగ్రెస్ గమనించాల్సి ఉంది. చాలా వరకు ఉత్తరాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి అట్టడుగు స్థాయిలో ఉనికే కరువైంది. కాంగ్రెస్ పార్టీకి కొంతమేర బలం ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో, వారు చేస్తున్న ఈ ఉద్యమానికి ఉనికి లేకుండా పోయింది. పార్టీ ఉనికి ఉన్న చోట ఉద్యమానికి స్పందన లేకపోవడం, ఉద్యమం నడిపించాలని చూస్తున్న చోట పార్టీకే పునాదులు లేకపోవడం దేనికి సంకేతం? కాంగ్రెస్ పూర్తిగా ప్రజా పునాదిని కోల్పోయిందనడానికి ఇది ప్రత్యక్ష నిదర్శనం కాదా?

కాంగ్రెస్ ఓటు బ్యాంక్ ను ఆవిరి చేస్తున్న బీజేపీ

కాంగ్రెస్ పార్టీ నిరంతరం ఈ ఎన్నికల విధానంపై, ఈసీపై ఆరోపణలు చేస్తూ కాలయాపన చేయాలనే బిజెపి కోరుకుంటోంది.ఒకవైపు కాంగ్రెస్‌ను ఈ సిద్ధాంతపరమైన గందరగోళంలో ఉంచుతూనే, మరోవైపు బిజెపి చాలా వ్యూహాత్మకంగా కాంగ్రెస్ సాంప్రదాయ ఓటు బ్యాంకులను ఒక్కొక్కటిగా విచ్ఛిన్నం చేస్తోంది. బిజెపి వైపు వచ్చే ఓటర్లను ఆకర్షించడమే కాకుండా, కాంగ్రెస్‌కు స్థిరంగా ఉండే ఓటు బ్యాంకులను ముక్కలు చేస్తోంది. దీనికి అస్సాంలో ఇటీవల జరిగిన నగావ్ లోక్‌సభ ఉపఎన్నిక ఫలితమే నిలువెత్తు సాక్ష్యం. నగావ్ లోక్‌సభ నియోజకవర్గం 60 శాతానికి పైగా ముస్లిం జనాభా కలిగిన ప్రాంతం. గతంలో దేశవ్యాప్తంగా బిజెపి క్లీన్ స్వీప్ చేసిన తుఫాను వేవ్‌లోనూ, ఈ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తూ వచ్చారు. అది కాంగ్రెస్‌కు అతిపెద్ద కంచుకోట. ఉపఎన్నికల్లో అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి ఏకంగా మూడో స్థానానికి. డిపాజిట్ కూడా కోల్పోయే పరిస్థితి వచ్చింది. AIUDF లేదా ఇతర ప్రాంతీయ ముస్లిం శక్తులు పుంజుకోవడం, మరోవైపు బిజెపి సొంతంగా ఓటింగ్ శాతాన్ని పెంచుకోవడంతో కాంగ్రెస్ అక్కడ నామరూపాలు లేకుండా పోయింది. ఇది కేవలం నగావ్‌కే పరిమితమైన అంశం కాదు. దేశవ్యాప్తంగా ముస్లిం సముదాయం ఇప్పుడు కాంగ్రెస్‌ను తమ ఏకైక రక్షకునిగా భావించడం లేదు. వారు ప్రత్యామ్నాయ ప్రాంతీయ లేదా సొంత రాజకీయ శక్తుల వైపు మొగ్గు చూపుతున్నారు.

సాఫ్ట్ హిందూత్వ ట్రాప్ – రెండింటికీ చెడ్డ రేవడి!

బిజెపి విసురుతున్న తీవ్ర హిందూత్వ భావజాలాన్ని తట్టుకోవడానికి, దానికి కౌంటర్ ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ సాఫ్ట్ హిందూత్వ మార్గాన్ని ఎంచుకుంది. అగ్రనేతలు రాముడు, శివుడు అంటూ కొత్త రాజకీయం ప్రారంభించారు. శివుడు మా దేవుడు అంటూ ప్రకటనలు చేస్తున్నారు. గుళ్ల చుట్టూ తిరగడం, కొత్త దీర్ఘాలు తీయడం ప్రారంభించారు. బిజెపి నిర్మించిన అదే పిచ్‌పై బ్యాటింగ్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ వ్యూహం వల్ల కాంగ్రెస్‌కు ఒరిగింది ఏమీ లేదు సరే కదా, ఉన్నది ఊడింది. సాంప్రదాయ ముస్లిం ఓటర్లలో అసంతృప్తికి ఇది కూడా ఓ కారణం. కాంగ్రెస్ అవకాశవాద హిందూత్వ ధోరణిని చూసి ముస్లింలు ఆ పార్టీకి దూరమై, సొంత ప్రాంతీయ శక్తులను ఆశ్రయిస్తున్నారు. సాఫ్ట్ హిందూత్వ నాటకాలను అసలైన హిందూ ఓటర్లు ఎంతమాత్రం నమ్మడం లేదు.ఒరిజినల్ హిందూత్వ బ్రాండ్ అందుబాటులో ఉన్నప్పుడు, నకిలీ సాఫ్ట్ వెర్షన్‌ను వారెందుకు ఆదరిస్తారు?. ఫలితంగా, బిజెపి పరిచిన మార్గంలోనే పయనిస్తూ కాంగ్రెస్ పార్టీ తన పరిధిని నిరంతరం కుంచించుకుపోయేలా చేసుకుంటోంది.

కాంగ్రెస్‌కు ఓటేసేది ఎవరు?

ఈ రోజు కాంగ్రెస్ పార్టీ పెద్దలు గుండెల మీద చేయి వేసుకుని, తమ సామాజిక ఓటు బ్యాంక్ పునాదులు ఎలా కదిలిపోయాయో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఏ సామాజిక వర్గం ఈ రోజు కాంగ్రెస్‌తో ఉంది?. ఓసీలు ఎప్పుడో కాంగ్రెస్ కు దూరమయ్యారు. బిజెపి లేదా స్థానిక ప్రాంతీయ పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారు. కాంగ్రెస్‌ను పూర్తిగా పక్కనబెట్టారు. బిజెపి సాధించిన అతిపెద్ద రాజకీయ విజయం ఓబీసీలను తమ వైపు తిప్పుకోవడం. మిగిలిన ఓబీసీ ఓటు బ్యాంక్ ప్రాంతీయ పార్టీల చేతుల్లో ఉంది. ప్రాంతీయ పార్టీలు, కొత్తగా ఆవిర్భవించిన సొంత వర్గ నేతల ముస్లింలు వైపు వెళ్తున్నారు. దళిత, క్రైస్తవ వర్గాల్లోని ఒక భాగం మాత్రమే ప్రస్తుతం కాంగ్రెస్‌కు మిగిలి ఉన్న బలహీనమైన ఆసరా. అంతేకాదు, కులమతాలకు అతీతంగా ఉండే సమాజంలోని మధ్యతరగతి పౌరులు, విద్యార్థులు, ఉద్యోగులు బిజెపి విధానాలను తీవ్రంగా వ్యతిరేకించే వారైనా సరే... కాంగ్రెస్‌కు ఓటేయడానికి వెనుకంజ వేస్తున్నారు. బిజెపిని వ్యతిరేకించడం సరే, కానీ ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌కు ఓటేసి మళ్లీ మనల్ని మనం ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చుకోవాలా? బలహీనమైన, దిశాలేని నాయకత్వానికి రాజ్యాధికారం ఇవ్వాలా? అని సగటు మధ్యతరగతి పౌరుడు ఆలోచిస్తున్నాడు. ఈ భయాన్ని, అనుమానాన్ని పోగొట్టడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైంది.

అపరిపక్వ వ్యూహాలు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ పార్టీ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. జంతర్ మంతర్ వద్ద ఒక పదివేల మందిని రప్పించి ధర్నాలు చేస్తే సరిపోతుందా? అని ప్రశ్నించారు. ఇది కేవలం రాజకీయ విమర్శ మాత్రమే కాదు, కాంగ్రెస్ ప్రస్తుత వైఫల్యానికి అద్దం పట్టే పచ్చి నిజం. రాహుల్ గాంధీ ఆలోచనా విధానం క్షేత్రస్థాయి రాజకీయ పరిపక్వతకు దూరంగా ఉందనే విమర్శలు ఉన్నాయి. నేపాల్, బంగ్లాదేశ్, లేదా శ్రీలంక వంటి పొరుగు దేశాల్లో యువత రోడ్లపైకి వచ్చి ప్రభుత్వాలను కూల్చివేసిన తరహాలోనే, ఇక్కడ కూడా ఏదో రకంగా యువతను, ప్రజలను రెచ్చగొట్టి పాలకులను తోసేయవచ్చనే అపరిపక్వమైన భావనలో ఆయన ఉన్నారు. కానీ భారతదేశం సుదీర్ఘమైన, బలమైన ప్రజాస్వామ్య మూలాలు ఉన్న దేశం. ఇక్కడ ప్రజాస్వామ్యబద్ధంగా, ఎన్నికల ప్రక్రియ ద్వారానే మార్పు సాధ్యమవుతుంది. మోదీ, అమిత్ షాల జంట అసలైన రాజకీయ చదరంగం ఆడుతూ, కాంగ్రెస్ ఎంతసేపూ రచ్చరంబోలా చేస్తూ ఎప్పటికీ గెలవలేని ఒక నిరసనకారుడిగానే మిగిలిపోయేలా చేస్తున్నారు.

కాక్రోచ్‌లకు దేశం బయట నుంచి ఫుల్ సపోర్ట్

ఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున రాజ్యాంగ సంస్థలను లక్ష్యంగా చేసుకుని గందరగోళం సృష్టిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ వెనుక అంతర్జాతీయ శక్తులు పనిచేస్తున్నాయన్న అనుమానాలకు రోజురోజుకూ బలమైన సాక్ష్యాలు లభిస్తున్నాయి. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకలలో అల్లర్ల ద్వారా ప్రభుత్వాలను కూల్చివేసి అరాచకం సృష్టించిన కలర్ రివల్యూషన్ మోడల్‌ను ఇప్పుడు భారతదేశంలోనూ ప్రయోగించేందుకు అంతర్జాతీయ స్థాయిలో పెద్ద కుట్ర జరుగుతోందన్న వాదనలు తెరపైకి వస్తున్నాయి. విచిత్రమేమిటంటే.. భారత్‌లో కాక్రోచ్ పార్టీ నిర్వహించే నిరసనలకు క్షేత్రస్థాయిలో సామాన్య ప్రజల నుంచి కనీస స్పందన గానీ, స్వచ్ఛంద మద్దతు గానీ లభించడం లేదు కానీ విదేశీ గడ్డల నుంచి, విదేశీ లాబీయిస్టుల నుంచి మాత్రం వీరికి అనూహ్యంగా వెల్లువలా సమర్థన లభిస్తుండటం యావత్ దేశాన్ని విస్మయానికి గురిచేస్తోంది.ప్రతీసారీ భారత్‌కు వ్యతిరేకంగా స్వరం వినిపించే భారత సంతతికి చెందిన అమెరికన్ డెమోక్రాట్ నాయకురాలు ప్రమీలా జయపాల్ వంటి విదేశీ రాజకీయ ప్రముఖుల నుంచి మొదలుకొని, భారత చట్టాల ఉల్లంఘనలతో గతంలోనే దేశం నుంచి బహిష్కరణకు గురైన వివాదాస్పద ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వరకు అందరూ కాక్రోచ్ ముఠాకు బాహాటంగా వకాల్తా పుచ్చుకుంటున్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు విధించిన ఆంక్షలను మానవ హక్కుల ఉల్లంఘన గా చిత్రీకరిస్తూ ఆమ్నెస్టీ అంతర్జాతీయ వేదికలపై ప్రకటనలు గుప్పించడం, అరెస్టయిన కాక్రోచ్ నాయకులను బేషరతుగా విడుదల చేయాలంటూ డిమాండ్లు చేయడం చూస్తుంటే.. వీరంతా ఒకే విదేశీ స్క్రిప్ట్‌ను పాటిస్తున్నారన్నది తేటతెల్లమవుతోంది.ఇదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను వ్యతిరేకించే కొందరు బడా సంపన్నులు, అంతర్జాతీయ డోనర్లు కాక్రోచ్ పార్టీకి, దాని నేత అభిజీత్ దిప్కేకు భారీగా విదేశీ నిధులు సమకూరుస్తున్నారంటూ ప్రముఖ అమెరికన్ గాయని మేరీ మిల్బెన్ ఇటీవల చేసిన ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశం ఆర్థికంగా, వ్యూహాత్మకంగా ప్రపంచ అగ్రరాజ్యాల సరసన నిలబడటాన్ని జీర్ణించుకోలేని కొన్ని విదేశీ శక్తులు.. విదేశాల్లో చదువుకున్న వ్యక్తులను పావులుగా వాడుకుంటూ స్థానికంగా గొడవలు రగిల్చేందుకు నిధులు కుమ్మరిస్తున్నారని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.సొంత దేశంలో ప్రజలు తిరస్కరించినప్పటికీ.. అమెరికా నేతలు, విదేశీ మీడియా, నిషేధిత స్వచ్ఛంద సంస్థలు పదేపదే వీరికి అంతర్జాతీయ కవరేజీ ఇస్తుండటం టూల్‌కిట్ రాజకీయాలను స్పష్టంగా రుజువు చేస్తోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. బంగాదేశ్, శ్రీలంక తరహాలో దేశాన్ని సంక్షోభంలోకి నెట్టేందుకు విదేశాల నుంచి అందుతున్న ఈ అదృశ్య హస్తాలపై నిఘా వర్గాలు మరింత లోతుగా దృష్టి సారించాల్సిన అవసరముందని, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడంలో ఎలాంటి రాజీ ఉండకూడదన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది.


లిక్కర్ గ్యాంగ్‌కు నిద్ర లేకుండా చేస్తున్న రజత్ భార్గవ

హైదరాబాద,వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రూ. 3,500 కోట్ల లిక్కర్ కుంభకోణం కేసులోగ్రాఫ్టంతికర నిజాలు బయటపడ్డాయి. అప్పట్లో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవ విజయవాడ మేజిస్ట్రేట్ కోర్టు ముందు సెక్షన్ 164 కింద న్యాయమూర్తికి ఇచ్చిన వాంగ్మూలంతో పాటు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణలో సమర్పించిన ఆధారాలు ఈ స్కామ్ వెనుక ఉన్న అసలు సూత్రధారుల గుట్టును రట్టు చేశాయి. లిక్కర్ దందా మొత్తం నాటి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే పకడ్బందీ కుట్ర ప్రకారం సాగిందని ఆయన వెల్లడించిన నిజాలు పాత పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి.2022 ఏప్రిల్‌లోనే మద్యం సరఫరా, బ్రాండ్ల కేటాయింపుల్లో జరుగుతున్న అక్రమాలను ఆయన గుర్తించారు. పాపులర్ బ్రాండ్లను తొక్కేసి, డిమాండ్ లేని నకిలీ, లోకల్ బ్రాండ్లకు అడ్డగోలుగా ఇండెంట్లు పెట్టడంపై నాటి బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డికి, ప్రత్యేక అధికారి సత్యప్రసాద్‌కు ఆయన మెమోలు జారీ చేశారు. అయితే, ఆ మెమోలను వెనక్కి తీసుకోవాలని, సదరు అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని అప్పటి సీఎం జగన్ మోహన్ రెడ్డి కోటరీలోని ముఖ్య కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిలు ఆయనపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చారు. రజత్ భార్గవ ఆధారాలతో సహా వీటిని దర్యాప్తు సంస్థలకు ఇచ్చారు.ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నించినందుకు రజత్ భార్గవ రెక్కలు విరిచేసేలా సీఎంవో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎక్సైజ్ స్పెషల్ సీఎస్ పరిధిలో ఉండే ఆర్డర్ ఫర్ సేల్ అధికారాలను ఆయన నుంచి రాత్రికి రాత్రే లాక్కొని, తమకు అనుకూలంగా పనిచేసే కిందిస్థాయి అధికారులకు కట్టబెట్టారు. ప్రసిద్ధ బ్రాండ్ల ఇండెంట్లను మ్యాన్యువల్ విధానంలో మార్చేసి, కమిషన్లు చెల్లించే మద్యం కంపెనీలకే ఆర్డర్లు వెళ్లేలా మాయాజాలం చేశారు. ఈ దందాను సీఎం సమీక్షల్లో రజత్ భార్గవ లేవనెత్తినా, ధనుంజయ్‌రెడ్డి ఆ అంశాలను మినిట్స్‌లో చేర్చకుండా తొక్కిపెట్టేవారని, జగన్ కోటరీ ఆదేశాల మేరకు బెంబేలెత్తించడంతో తాను ఒంటరిగా పోరాడలేక మౌనం వహించాల్సి వచ్చిందని ఆయన వాంగ్మూలంలో పేర్కొన్నారు.మరోగ్రాఫ్టంతికర విషయం ఏమిటంటే? వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దిగిపోయే ముందు 2019 నుంచి 2024 వరకు జరిగిన నాటా ఆర్డర్ల డేటాను, ప్రభుత్వ రికార్డులను మాయం చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. అప్పటి ఎక్సైజ్ కమిషనర్ వివేక్ యాదవ్‌ను పాత తేదీలతో సంతకాలు చేసి డేటాను ట్యాంపర్ చేయమని సీఎంవో నుంచి ఒత్తిడి తెచ్చారని, ఆయన అంగీకరించకపోవడంతో రజత్ భార్గవపై కూడా ఒత్తిడి పెంచారని తెలుస్తోంది. అయితే, తాము ఈ అక్రమాలకు సహకరించలేదని, దానికి సంబంధించిన రికార్డుల పరంపర ఇప్పటికీ సెక్రటేరియట్ ఫైళ్లలో భద్రంగా ఉందంటూ దానికి సంబంధించిన సాక్ష్యాలను కూడా ఆయన ఈడీ దర్యాప్తు అధికారుల ముందుంచారు.ప్రస్తుతం రజత్ భార్గవ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఈడీ, సిట్ విచారణను మరింత వేగవంతం చేశాయి. సీఎంవో స్థాయి నుంచి సాగిన రూ. 3,500 కోట్ల కిక్‌బ్యాక్స్, మనీలాండరింగ్ నెట్‌వర్క్ గుట్టు వీడటంతో నాటి ప్రభుత్వ పెద్దలకు అరెస్టు భయం పట్టుకుంది. ప్రజాధనాన్ని దోచుకుని, జనం ప్రాణాలతో చెలగాటమాడిన లిక్కర్ ముఠా అసలు ముసుగులు త్వరలోనే పూర్తిగా తొలగిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

ఇందుకూరు పంచాయతీలో కూటమి అభ్యర్థులు గెలిస్తేనే గిరిజన అభివృద్ధి

దేవీపట్నం,స్థానిక సంస్థల ఎన్నికల లో ఇందుకూరు పంచాయతీలో ఇప్పటి నుండే చర్చ మొదలైంది. ఇందుకూరులో కూటమి గెలిస్తేనే గిరిజన అభివృద్ధి సాధ్యమవుతుందనే అభిప్రాయం గ్రామస్తుల్లో వ్యక్తమవుతోంది.దేవీపట్నం మండలం ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఐ టి డి ఎ నిధులతోనే అభివృద్ధి జరుగుతుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున, ఇందుకూరు పంచాయతీలో కూడా కూటమి సర్పంచ్, ఎంపీటీసీ ఉంటేనే ఆ నిధులు సక్రమంగా వస్తాయని గిరిజన పెద్దలు అంటున్నారు.ఎన్నికల ప్రచారం ఇంకా మొదలు కానప్పటికీ, కూటమి నాయకులు బలమైన అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో ఉన్నట్లు సమాచారం. గ్రామంలో రోడ్లు, తాగునీరు, గిరిజన సంక్షేమ వధ కాలు అమలు కావాలంటే కూటమి అవనరమని ప్రజలు చర్చించుకుంటున్నారు.

స్థానిక పోరులో బలమైన వ్యూహం



విజయవాడ ,ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ, మున్సిపల్, జడ్పీటీసీ ఎన్నికల వేళ అధికార ఎన్డీయే కూటమిలోని ప్రధాన భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, ఆధిపత్య పోరు రచ్చకెక్కుతోంది. క్షేత్రస్థాయిలో తమ గ్రాఫ్ , ఓటు బ్యాంక్ అత్యంత బలంగా ఉందని రెండు పార్టీల ద్వితీయ శ్రేణి నాయకత్వాలు గట్టిగా నమ్ముతున్నాయి. శాసనసభ ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించామన్న ధీమాతో జనసేన 40 శాతం స్థానాలను డిమాండ్ చేస్తూంటే.. దశాబ్దాల క్షేత్రస్థాయి కేడర్ బలం తమకే ఉందంటూ టీడీపీ స్థానిక నాయకులు ప్రతిఘటిస్తున్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం పార్టీ బలం లేదా అడిగినన్ని సీట్లు కేటాయించడం మాత్రమే ముఖ్యం కాదు. డివిజన్, వార్డు , గ్రామ

విశాఖ పోర్ట్‌కు అరుదైన ఘనత..

విశాఖపట్నం ,విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సరుకు నిర్వహణలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. 2026?27 ఆర్థిక సంవత్సరంలో కేవలం 196 రోజుల్లోనే 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును నిర్వహించింది. అక్టోబర్ 13, 2026 నాటికి మొత్తం 50,007,081 టన్నుల కార్గోను నిర్వహించడం ద్వారా ఈ ఘనతని సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గత రికార్డుతో పోలిస్తే 17 రోజులు, అంతకుముందు రికార్డుతో పోలిస్తే 28 రోజుల ముందుగానే ఈ ఘనతను సాధించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఇదే మైలురాయిని చేరుకోవడానికి 213 రోజులు, 2024?25లో 224 రోజులు సమయం పట్టిందని పోర్ట్ అధికారులు ప్రకటన జారీ చేశారు.పోర్ట్ ఈ ఘనతను సాధించడంలో కృషి చేసిన ట్రాఫిక్ విభాగాన్ని చైర్‌పర్సన్ జె.ఎస్. బింద్రా, ఐఆర్‌టీఎస్, డిప్యూటీ చైర్‌పర్సన్ రోష్ని అపరాంజి కోరాటి అభినందించారు. ఇదే స్ఫూర్తితో సమష్టిగా కృషి చేసి, 2026?27 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 100 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో నిర్వహణ లక్ష్యాన్ని సాధించాలని సిబ్బందికి సూచించారు.13 అక్టోబర్ 2026: 196 రోజుల్లో 50 ఎంఎంటీ కార్గో నిర్వహణ మైలురాయిని అధిగమించింది.7 అక్టోబర్ 2026: 180 రోజుల్లో 45 ఎంఎంటీ కార్గో నిర్వహణను సాధించింది.3 సెప్టెంబర్ 2026: 156 రోజుల్లో 40 ఎంఎంటీ కార్గోను నిర్వహించింది.1 సెప్టెంబర్ 2026 ? ఎస్‌పీఎం: బెల్జియం జెండాతో ప్రయాణిస్తున్న నౌకకు బెర్తింగ్ సదుపాయం కల్పించింది. 339.50 మీటర్ల పొడవు, 60.04 మీటర్ల వెడల్పు కలిగిన ఈ నౌక ఎస్‌పీఎం బెర్త్ వద్ద బెర్తింగ్ పొందిన అతిపెద్ద ముడి చమురు రవాణా నౌకగా నిలిచింది15 ఆగస్టు 2026: 137 రోజుల్లో 35 ఎంఎంటీ కార్గో నిర్వహణను సాధించింది.11 ఆగస్టు 2026 ఈక్యూ–1ఏ నౌక నుంచి 36,800 టన్నుల సున్నపురాయిని బల్క్ రూపంలో అన్‌లోడ్ చేసింది.23 జూలై 2026: 114 రోజుల్లో 30 ఎంఎంటీ కార్గో నిర్వహణను సాధించింది.3 జూలై 2026 ? 94 రోజుల్లో 25 ఎంఎంటీ కార్గో నిర్వహణ మైలురాయిని చేరుకుంది.జూన్ 2026 ? ఒక క్యాలెండర్ నెలలో అత్యధికంగా 2,158,712 టన్నుల ముడి చమురును అన్‌లోడ్ చేసి రికార్డు సృష్టించింది.14 జూన్ 2026: 76 రోజుల్లో 20 ఎంఎంటీ కార్గో నిర్వహణను సాధించింది.5 జూన్ 2026 ఈక్యూ–1:నౌకకు బెర్తింగ్ సదుపాయం కల్పించింది. 292 మీటర్ల పొడవు, 45 మీటర్ల వెడల్పు కలిగిన ఈ పరిమాణంలోని నౌక ఈక్యూ–1 వద్ద బెర్తింగ్ పొందడం ఇదే తొలిసారి.1 జూన్ 2026 ఈక్యూ–1ఏ: 818 నౌక నుంచి 36,010 టన్నుల మాంగనీస్ ఖనిజాన్ని అన్‌లోడ్ చేసింది.మే 2026 ? నెలలో అత్యధికంగా 1,858,169 టన్నుల ముడి చమురును అన్‌లోడ్ చేసింది.11 మే 2026: 41 రోజుల్లో 10 ఎంఎంటీ కార్గో నిర్వహణను సాధించింది.25 ఏప్రిల్ 2026 ? ఈక్యూ–1: నౌకకు బెర్తింగ్ సదుపాయం కల్పించింది. 260 మీటర్ల పొడవు, 43 మీటర్ల వెడల్పు కలిగిన ఈ నౌకకు బెర్తింగ్ కల్పించడం ద్వారా మరో కీలక మైలురాయిని నమోదు చేసింది.

సుప్రీంకోర్టు కేసులు క్లియర్ కాగానే ఆ 23 స్థానాల్లో ఎన్నికలు

కాకినాడ,ఏపీలో 123 అర్బన్ లోకల్ బాడీస్ ఉండగా ప్రస్తుతం 10 నగర పంచాయతీలు, 77 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లకు మాత్రమే ఎలక్షన్ నోటిఫికేషన్ జారీ అయింది. సుప్రీంకోర్టులో కేసుల కారణంగా 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 15 మున్సిపాలిటీలు, 4 నగర పంచాయతీలకు ప్రస్తుతం నోటిఫికేషన్ రిలీజ్ కాలేదు. సుప్రీంకోర్టు కేసులు క్లియర్ కాగానే ఆ 23 స్థానాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు ఏపీ ఎలక్షన్ ప్రధాన కమిషనర్. సమీప గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ నడుస్తోంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి కోర్టు నోటీసులు జారీ చేసింది. విలీన ప్రక్రియను నిలిపివేస్తూ మధ్యంతర స్టే ఇచ్చేందుకు నిరాకరించినప్పటికీ.. ప్రభుత్వం తీసుకునే చర్యలన్నీ తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. అన్ని పిటిషన్లపై నవంబర్ 17న సుప్రీంకోర్టులో తుది విచారణ జరగబోతోంది. న్యాయపరమైన వివాదం కారణంగా ఎన్నికలు నిర్వహించలేని పట్టణ స్థానిక సంస్థల జాబితాలో మొత్తం 23 ప్రాంతాలున్నాయి. వీటిలో రాజమండ్రి, కాకినాడ, మంగళగిరి, శ్రీకాకుళం లాంటి కీలక కార్పొరేషన్లు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, ఏలూరు జిల్లాలోని ఒక మున్సిపాలిటీలో ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్ పడింది. పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెంతో పాటు.. ఏలూరు జిల్లా చింతలపూడి మున్సిపాలిటీల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడలేదు. భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లులో విలీన గ్రామాల ప్రజలు కోర్టును ఆశ్రయించారు. తణుకులో వార్డుల డీలిమిటేషన్ కారణంగా ఎన్నికలు ఆగాయి.రాజమండ్రి కార్పొరేషన్‌కు సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. విలీన గ్రామాల ప్రజలు రాజమండ్రి కార్పొరేషన్ ఏకపక్ష నిర్ణయాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పిటిషన్ హైకోర్టులో.. విచారణ దశలో ఉన్న కారణంతో ఎన్నికలు తాత్కాలికంగా నిలిపివేశారు. కుశాలపురం పంచాయతీ విలీనంపై గ్రామస్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో.. శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికలు ఆగాయి. 2005 తర్వాత శ్రీకాకుళం మున్సిపాలిటీలో ఎన్నికలు జరగలేదు. 12ఏళ్లుగా శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో ఎన్నికలు జరగడం లేదు. ఈసారి కూడా వారికి నిరాశే ఎదురైంది. విలీన గ్రామాలు కేసు, వార్డుల విజభన పెండింగ్ ఉండటంతో.. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వలేదు.విజయనగరం జిల్లా రాజాం నగర పంచాయతీలో కోర్టు కేసుల కారణంగా 21ఏళ్లు ఎన్నికలు జరగలేదు. ఇటీవలే విలీన గ్రామాల పిటిషనర్లు కేసు విత్ డ్రా చేసుకోవడంతో ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా.. వార్డుల విభజన పూర్తికాకపోవడంతో.. రాజాంలోనూ ఎన్నికల జరపడం లేదు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మున్సిపాలిటీకి చివరగా 2014లో ఎన్నికలు జరిగాయి. వార్డుల విభజన సరిగా లేదని టీడీపీ నేత కోర్టును ఆశ్రయించడంతో.. గ్రేడ్ 2 మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ అయినప్పటికీ కోర్టు వివాదం కారణంగా ఎన్నికలు నిర్వహించడం లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్‌లో ఎన్నికలు ఆగాయి. పల్నాడు జిల్లాలోని నర్సరావుపేట, గుంటూరు జిల్లాలోని పొన్నూరు, బాపట్ల జిల్లాలోని బాపట్ల మున్సిపాలిటీతో పాటు మంగళగిరి కార్పొరేషన్ ఎన్నికలకు బ్రేక్ పడింది. వార్డుల పునర్విభజన, ఓటర్ జాబితా, రిజర్వేషన్లు ఖరారు కాకపోవడంతో ఎన్నికలు ఆపారు.కావలి మున్సిపాలిటీ పరిధిలో తమను కలపొద్దు అంటూ కావలి రూరల్ మండలం చౌదరిపాలానికి చెందిన వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. దీంతో గతంలో ఇక్కడ ఎన్నికలు జరగలేదు. అల్లూరు నగర పంచాయతీ, గూడూరు మున్సిపాలిటీల్లో విలీన గ్రామాల ప్రజలు కోర్టును ఆశ్రయించడంతో రెండుచోట్ల ఎన్నికలు జరగడం లేదు. మార్కాపురం జిల్లా పొదిలి నగర పంచాయతీలోనూ సేమ్ సీన్. విలీన గ్రామాల ప్రజలు కోర్టు మెట్లెక్కడంతో ఎన్నిక ఆగింది. ప్రకాశం జిల్లా కందుకూరు మున్సిపాలిటీలో వార్డుల విభజన ఆలస్యం కావడంతో తొలిదశలో ఎన్నికలు జరపడం లేదు. బి. కొత్తకోట మున్సిపాలిటీపై కోర్ట్ కేసు వెనక్కి తీసుకున్నా.. తుది తీర్పురాకపోవడంతో ఎన్నిక ఆగింది.

ఉమ్మడి కడప జిల్లా.. వైసీపీకి అతిపెద్ద సవాల్!



కడప: ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల పోరు హోరాహోరీని తలపించనుంది. ఎందుకంటే, ఇది వైఎస్ జగన్ అడ్డా. ఈ జిల్లాలో కడప మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు తొమ్మిది మున్సిపాల్టీలున్నాయి. ఇందులో వైఎస్ జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల కూడా వుండడం ఆసక్తి రేపుతోంది. వీటిలో అధికార , ప్రతిపక్ష పార్టీల బలాబలాలేంటో తెలుసుకుందాం.

కడప మున్సిపల్ కార్పొరేషన్:

ఇక్కడి నుంచి టీడీపీ ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ కార్పొరేషన్‌ను ఓసీ మహిళకు కేటాయించారు. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక, కడప మున్సిపాల్టీ కాస్తా కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. ఇక్కడి నుంచి మొదటి మేయర్‌గా వైఎస్సార్ బామ్మర్ది పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఎన్నికయ్యారు.వైఎస్సార్ మరణానంతరం ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల గురించి తెలిసిందే. వైఎస్ జగన్ నేతృత్వంలో వైసీపీ ఏర్పడింది. కడప కార్పొరేషన్‌లో వైసీపీనే పట్టు నిలుపుకుంటూ వచ్చింది. అయితే ఈ దఫా ఎన్నికలు మాత్రం, గతం కంటే భిన్నంగా వుంటాయా? లేక వైసీపీనే హవా కొనసాగిస్తుందా? అనే చర్చ విస్తృతంగా సాగుతోంది.టీడీపీ తరపున అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి కోడలు ఉమాదేవికి మంత్రి నారా లోకేశ్ మద్దతు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఆమె అభ్యర్థిత్వాన్ని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎమ్మెల్యే మద్దతుదారులుగా పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ తన కుమార్తెనే నిలబెట్టడానికి ఎమ్మెల్యే ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే అభిప్రాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్టు సమాచారం.ఇక వైసీపీ విషయానికి వస్తే కడప మాజీ డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి సతీమణి దీప్తిరెడ్డి బరిలో నిలవనున్నారు. కొంతకాలం క్రితం నిత్యానందరెడ్డి సొంత పార్టీ కార్యకర్త హత్య కేసులో జైలుకు వెళ్లి వచ్చిన సంగతి తెలిసిందే. కడపలో ఎన్నికలు సాఫీగా సాగితే వైసీపీ గెలుపు నల్లేరుపై నడకే. కానీ ఆ పరిస్థితి వుంటుందా? అనేది అనుమానమే.

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ:

జిల్లాలో కడప తర్వాత ప్రొద్దుటూరు పెద్ద మున్సిపాలిటీ. ఈ మున్సిపాల్టీని జనరల్‌కు కేటాయించారు. ఇక్కడ రసవత్తర పోటీ జరగనుంది. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తమ్ముడు రాఘవరెడ్డి, అలాగే కాంట్రాక్టర్ పర్లపాడు మహేశ్‌రెడ్డి, బీసీవీఆర్ ట్రావెల్స్ అధినేత కుమారుడు సూర్యప్రతాప్‌రెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

ఇదే సందర్భంలో టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ జీవీ ప్రవీణ్‌రెడ్డి తన సతీమణి మౌనికారెడ్డికి చైర్‌పర్సన్ పదవి ఇప్పించేందుకు సీరియస్‌గా పావులు కదుపుతున్నారు. ప్రవీణ్‌కు నారా లోకేశ్ మద్దతు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇదిలా వుండగా రాఘవరెడ్డిని నిలపడం అన్న అయిన వరదరాజులరెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డికి ఇష్టం లేదని అంటున్నారు.వైసీపీ తరపున పోరెడ్డి నరసింహారెడ్డి లేదా మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి సతీమణి రమాదేవి బరిలో నిలిచే అవకాశం వుంది. అనూహ్యంగా బీసీ అభ్యర్థిని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బరిలో నిలిపేందుకు రాచమల్లు ఆలోచిస్తున్నారని అంటున్నారు. ప్రొద్దుటూరులో పోటీ నువ్వా, నేనా అన్నట్టుగా సాగనుంది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఫలితాల్ని అనుకూలంగా మలుచుకునేందుకు టీడీపీ నేతలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తారనే ప్రచారం జరుగుతోంది.

పులివెందుల మున్సిపాలిటీ:

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఎన్నికలు ప్రతిష్టాత్మకం కానున్నాయి. ఈ మున్సిపాల్టీని ఓసీ మహిళకు కేటాయించారు. వైసీపీ తరపున జగన్ చిన్నాన్న వైఎస్ మనోహర్‌రెడ్డి సతీమణి బరిలో నిలవనున్నారు.టీడీపీ విషయానికి వస్తే, పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి సతీమణి లేదా తూగుట్ల మధుసూదన్‌రెడ్డి కుమార్తె బరిలో నిలిచే అవకాశం వుంది. కుప్పంలో వైసీపీ గెలుపునకు ప్రతీకారంగా పులివెందులలో ఎలాగైనా పాగా వేయాలని టీడీపీ పెద్దలు చంద్రబాబు, నారా లోకేశ్ ఆదేశించినట్టు ప్రచారం జరుగుతోంది.ఎన్నికలు సజావుగా సాగితే, ఇక్కడ వైసీపీ గెలుపు గురించి ఆలోచించాల్సిన పనిలేదు. అయితే ఆ వాతావరణం కనిపించడం లేదు. ఇక్కడ ఏమవుతుందో చివరి వరకూ ఏమీ చెప్పలేని పరిస్థితి. పులివెందుల రూరల్ జెడ్పీటీసీ ఉప ఎన్నికలో టీడీపీ దుర్మార్గంగా వ్యవహరించడంతో, ఇప్పుడు మున్సిపాల్టీలో ఏమవుతుందో అనే భయం వైసీపీని వెంటాడుతోంది.

బద్వేల్ మున్సిపాలిటీ:

బద్వేల్ మున్సిపాల్టీ పోరు ఆసక్తికరంగా మారనుంది. ఈ మున్సిపాలిటీని జనరల్‌కు కేటాయించారు. దీంతో ఇక్కడి నుంచి దివంగత బిజివేముల వీరారెడ్డి కుటుంబ సభ్యులు పోటీ చేయాలనే ఆలోచనతో ఉన్నారు. ఇటీవలే అక్కడ టీడీపీ ఇన్‌చార్జ్‌గా బిజివేముల విజయమ్మ కుమారుడు రితీష్‌రెడ్డిని తప్పించిన సంగతి తెలిసిందే. కొత్త ఇన్‌చార్జ్‌గా డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డికి బాధ్యతలు అప్పగించారు.విజయమ్మ కుటుంబ సభ్యులకు మున్సిపాలిటీలో స్థానం కల్పించేందుకు సూర్యనారాయణరెడ్డి ససేమిరా అంటున్నట్టు తెలిసింది. తన కుమార్తెను బరిలో నిలపాలని ఆయన ఆలోచిస్తున్నారని సమాచారం. అలాగే బోయిళ్లవారిపల్లెకు చెందిన కాంట్రాక్టర్ టీడీపీ తరపున టికెట్ ఆశిస్తున్నట్టు తెలిసింది.ఈ నియోజకవర్గంలో వైసీపీ బలంగా వుంది. గత సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెలిచిన 11 స్థానాల్లో బద్వేల్ కూడా వుండడం విశేషం. డాక్టర్ సుధా ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, డాక్టర్ సుధా మంచి అభ్యర్థుల్ని నిలిపేందుకు కసరత్తు చేస్తున్నారు.జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, బలిజ సామాజిక వర్గానికి చెందిన గురుమోహన్ టికెట్ ఆశిస్తున్నారు. గురుమోహన్ కుటుంబానికి బద్వేల్‌లో బలం వుంది. గతంలో గురుమోహన్ మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోయారు. గురుమోహన్ తండ్రి పరంధామయ్యకు మంచి పేరు వుంది. ఇక్కడ ఎన్నికలు సక్రమంగా జరిగితే, వైసీపీకి అనుకూలంగా ఫలితం వుంటుందనడంలో సందేహం లేదు.

మైదుకూరు మున్సిపాలిటీ:

ఇక్కడి నుంచి టీడీపీ తరపున పుట్టా సుధాకర్ యాదవ్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ మున్సిపాలిటీని జనరల్‌కు కేటాయించారు. టీడీపీ తరపున చాలా మంది బలిజ నాయకులు మున్సిపల్ చైర్మన్ టికెట్ ఆశిస్తున్నారు.ఇంకా అభ్యర్థి ఖరారు కాలేదు. వైసీపీ తరపున మాధవ్ అనే బలిజ నాయకుడు టికెట్ ఆశిస్తున్నారు. అయితే ఆర్థికంగా తనకు సాయం చేస్తే, పోటీలో వుండడానికి ఇబ్బంది లేదని అంటన్నట్టు గెలిసింది. పోటీ నువ్వా, నేనా అన్నట్టుగా సాగనుంది.

రాజంపేట మున్సిపాలిటీ:

ఇక్కడి నుంచి వైసీపీ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కూటమి సునామీలో కూడా వైసీపీ గెలుపొందడంతో అందరి దృష్టిని ఆకర్షించింది. టీడీపీ తరపున గంప శివ కుమార్తె బరిలో వుంటుందనే ప్రచారం సాగుతోంది. డాక్టర్ సుధాకర్ కుటుంబ సభ్యుల పేర్లు కూడా పరిశీలనలో వున్నట్టు తెలుస్తోంది.వైసీపీ తరపున ఇంకా ఎవరి పేర్లు ఖరారు కాలేదు. ప్రధానంగా డబ్బున్న అభ్యర్థుల కోసం వైసీపీ వెతుకులాడుతోంది. ఒకట్రెండు రోజుల్లో ఖరారు చేసే అవకాశం వుంది. ఎన్నికలు సజావుగా జరిగితే, ఇక్కడ వైసీపీ గెలుపు సునాయాసం.

రాయచోటి మున్సిపాలిటీ:

ఇక్కడ నుంచి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో మంత్రి ఏ రకంగా ప్రవర్తించారో అందరూ చూశారు. ఇప్పుడు రాయచోటిలో తాను ప్రాతినిధ్యం వహించే చోట వైసీపీని దెబ్బ కొట్టేందుకు పోలీస్ యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో వినియోగించనున్నట్టు తెలుస్తోంది.రాయచోటి మున్సిపాలిటీని బీసీ జనరల్‌కు కేటాయించారు. టీడీపీ, వైసీపీ నుంచి పోటీ చేసేవాళ్లు ఎక్కువే. వైసీపీ తరపున షరీఫ్, బసురుల్లా, జాకీర్‌హుస్సేన్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. టీడీపీ తరపున ఖాదర్‌వల్లి, మదన్‌మోహన్, గాజుల ఖాదర్‌బాషా పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఎన్నికలు సక్రమంగా జరిగితే 44 వార్డుల్లో కనీసం మూడు వార్డులు కూడా టీడీపీ గెలిచే పరిస్థితి లేదు. ఎన్నికల్లో మంత్రి మార్క్ కనిపిస్తే, ఆ సంఖ్య రివర్స్ అవుతుందని వైసీపీ నేతలే చెబుతున్నారు. ఇక్కడి నుంచి వైసీపీ తరపున గడికోట శ్రీకాంత్‌రెడ్డి నాయకత్వం వహిస్తున్నారు. అధికార పార్టీని ఎలా ఎదుర్కొంటారో చూడాలి.

కమలాపురం మున్సిపాలిటీ:

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మేనమామ రవీంద్రనాథ్‌రెడ్డి పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా కొనసాగిన నియోజకవర్గం కమలాపురం. ఈ మున్సిపాలిటీని ఓసీ మహిళకు కేటాయించారు. పోటీ రసవత్తరంగా సాగనుంది. టీడీపీ ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.టీడీపీ తరపున దివాకర్‌రెడ్డి సతీమణి పోటీ చేయనున్నారు. వైసీపీ నుంచి రాజోలు వీరారెడ్డి తమ్ముడు ఆర్వీఎన్‌ఆర్ భార్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మార్జోళ్ల శ్రీనివాస్‌రెడ్డి కుమార్తెలలో ఎవరో ఒకరు బరిలో నిలిచే అవకాశం ఉంది. సక్రమంగా ఎన్నికలు జరిగితే, అనూహ్య ఫలితాలు వస్తాయని వైసీపీ నేతలు అంటున్నారు.

జమ్మలమడుగు మున్సిపాలిటీ:

ఈ నియోజకవర్గం నుంచి బీజేపీ సీనియర్ నేత ఆదినారాయణరెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆది అన్న కుమారుడు భూపేష్‌రెడ్డి టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జమ్మలమడుగు మున్సిపాలిటీని ఓసీ మహిళకు కేటాయించారు. ఇక్కడి నుంచి ఆదినారాయణరెడ్డి సతీమణి బీజేపీ తరపున, వైసీపీ నుంచి మాజీ మంత్రి పి.రామసుబ్బారెడ్డి సతీమణి ఇందిరా పోటీ చేయనున్నారు.తన నియోజకవర్గ పరిధిలోని జమ్మలమడుగు, ఎర్రగుంట్ల మున్సిపాలిటీల్లో వైసీపీ కనీసం ఒక్క వార్డు గెలిచినా సరే, రాజకీయాల నుంచి నిష్క్రమిస్తానని ఆదినారాయణరెడ్డి సవాల్ విసిరారు. దీన్నిబట్టి ఎన్నికలు ఎలా జరుగుతాయో అంచనా వేసుకోవచ్చు.తమ అభ్యర్థులకు మున్సిపల్ కమిషనర్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్నట్టు వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు సజావుగా సాగే పరిస్థితి లేదు.

థర్మల్ ప్లాంట్లలో డేంజర్ బెల్స్.. తగ్గుతున్న బొగ్గు నిల్వలు..



హైదరాబాద్, కాంగ్రెస్ సర్కార్ నిర్వహణ లోపాలతో రాష్ట్రంలో విద్యుత్తు సంక్షోభం తారస్థాయికి చేరింది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యుదుత్పత్తి కేంద్రాలను బొగ్గుకొరత పట్టి పీడిస్తున్నది. రాష్ట్రంలోని జెన్‌కో థర్మల్ ప్లాంట్లకు సరిపడా బొగ్గు అందకపోవడంతో నిల్వలు తగ్గుతున్నాయి. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) నిబంధనల ప్రకారం 21 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలుండాలి. కానీ రాష్ట్రంలోని ఏ ప్లాంట్‌లోనూ 21 రోజులకు సరిపడా కోల్‌స్టాక్స్ లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం సగటున కేవలం 9 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలే ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. యాదాద్రి పవర్ ప్లాంట్ (వైటీపీఎస్)లో కేవలం 5 రోజులకు సరిపడ నిల్వలే ఉండటం గమనార్హం.ఈ ప్లాంట్‌పై రేవంత్ సర్కార్ వివక్ష కారణంగా అవసరం మేరకు బొగ్గు సరఫరా కావడం లేదని ఉద్యోగ వర్గాలే చెప్తున్నాయి. రాష్ట్రంలో కొంత మేరకైనా బొగ్గు నిల్వలున్న ప్లాంట్ ఏదైనా ఉన్నదంటే అది భూపాలపల్లిలోని కాకతీయ థర్మల్ ప్లాంట్ మాత్రమే. తాడిచెర్ల కోల్‌బ్లాక్ జెన్‌కోకు చెందినది. రోడ్డుమార్గంలో 11 వేల మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా అవుతుండగా.. ఈ ఒక్క ప్లాంట్‌కు మాత్రమే అంతో ఇంతో బొగ్గు అందుతున్నది. వైటీపీఎస్‌కు బొగ్గు లింకేజీ లేదని, సరిపడా బొగ్గు అందడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా అంతా ఆరోపణలు చేస్తున్నారు. మరి మిగతా ప్లాంట్లల్లో బొగ్గు నిల్వలెందుకు లేవన్న ప్రశ్నలు సర్వత్రా ఉత్పన్నమవుతున్నాయి. మిగతా వాటికి బొగ్గు లింకేజీ ఉన్నా సరిపడా నిల్వలు ఎందుకు ఉంచలేకపోతున్నారని విద్యుత్తురంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు.


వైటీపీఎస్‌లో వేధిస్తున్న బొగ్గు కొరత

రాష్ట్రంలో అతిపెద్ద విద్యుదుత్పత్తి ప్లాంట్ వైటీపీఎస్‌లో ప్రస్తుతం 5 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు మాత్రమే ఉన్నాయి. నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యం గల ఈ ప్లాంట్‌లో రోజువారీ బొగ్గు వినియోగం 27 వేల మిలియన్ టన్నులు. కానీ ఈ ప్లాంట్‌కు సరఫరా అవుతున్న బొగ్గు 23,964 మిలియన్ టన్నులే. అంటే 3,036 మిలియన్ టన్నుల బొగ్గు తక్కువగా అందుతున్నది. నెలకు సగటు వినియోగం 3,33,603 మిలియన్ టన్నులుంటే.. ఈ ప్లాంట్‌కు అందుతున్నది 3,25,814 మిలియన్ టన్నులు. అంటే నెలకు సగటున 7,789 మిలియన్ టన్నులు బొగ్గు కొరత సమస్య ఈ ప్లాంట్‌ను వేధిస్తున్నది. నైనీ నుంచి బొగ్గును తెప్పిస్తున్నా కొరత తీరడం లేదు. ఈ ప్లాంట్‌లోని ఐదో యూనిట్ ఇంకా అందుబాటులోకే రాలేదు. నడుస్తున్న నాలుగు యూనిట్లలో 800 మెగావాట్ల యూనిట్ -1 నడువడమే లేదు.

ట్వీట్లతో పోటీ లెక్క తేల్చేస్తున్న పెద్దలు

విజయవాడ ,తమిళనాడు ముఖ్యమంత్రిగా తొలిసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన విజయ్ పర్యటన రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది. అయితే విజయ్ పర్యటనలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్కడా కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. విజయ్ విజయవాడ టూర్ షెడ్యూల్ ఖరారైనప్పుడు .. ఆయన వ్యక్తిగతంగా పవన్‌తో భేటీ అవుతారని, లేదంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగే అధికారిక సమావేశంలో డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కల్యాణ్ పాల్గొంటారని జోరుగా ప్రచారం జరిగింది. తీరా చూస్తే, చంద్రబాబుతో జరిగిన జల చర్చల్లో గానీ, పున్నమి ఘాట్ వద్ద జరిగిన విజయవాడ ఉత్సవ్ 2.0 వేదికపై గానీ పవన్ అస్సలు కనిపించలేదు.పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చినప్పుడు.. అదీ సినిమా రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఒక స్టార్ లీడర్ ఏపీకి విచ్చేసిన వేళ, అదే సినీ నేపథ్యం, ప్రజాదరణ ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అధికారిక కార్యక్రమాల్లో భాగస్వామి అయి ఉంటే హుందాగా ఉండేదన్న అభిప్రాయం సాధారణ ప్రజల్లో, అభిమానుల్లో వ్యక్తమైంది. పైగా విజయవాడ నడిబొడ్డున జరిగే సాంస్కృతిక వేడుకలకు ఉప ముఖ్యమంత్రి హాజరు కాకపోవడం వెనుక ఏదైనా ప్రోటోకాల్ సమస్య ఉందా లేక రాజకీయ కారణాలు ఉన్నాయా అన్న ప్రశ్నలు సోషల్ మీడియాలో వెల్లువెత్తాయి. ఏపీ సర్కార్ తరఫున మున్సిపల్ మంత్రి నారాయణ, ఇతర అధికారులు ముందుండి కార్యక్రమాలను నడిపించారే తప్ప, పవన్ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు.పవన్ కల్యాణ్ ఈ పర్యటనకు కావాలనే దూరంగా ఉండటం వెనుక ఒక బలమైన రాజకీయ, ఆత్మగౌరవ కోణం దాగి ఉందని జనసేన వర్గాలు చెబుతున్నా

స్థానికంలో సూపర్ సిక్స్..!



అమరావతి,స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయమే లక్ష్యంగా ప్రచార అస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. సాధారణంగా స్థానిక ఎన్నికల్లో ఓటర్లు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామీణ/పట్టణ అభివృద్ధిని ప్రధానంగా చూస్తారు. కూటమి నాయకుల విశ్లేషణలు, పార్టీ శ్రేణుల ప్రచారం ప్రకారం ఈ ఎన్నికల్లో కూటమికి ప్రధానంగా కలిసి వచ్చే పథకాలు ఇవేనని అంటున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రధాన కారణమైన 'సూపర్ సిక్స్' హామీలు ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించనున్నాయని చెబుతున్నారు.ఎన్టీఆర్ భరోసా పింఛన్లు: సామాజిక పింఛన్లను ఒకేసారి రూ.4,000లకు పెంచి నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు పంపిణీ చేస్తుండటం కూటమికి అతిపెద్ద సానుకూల అంశం. అలాగే దివ్యాంగులకు పింఛన్‌ను రూ. 6,000 కు పెంచడం గ్రామీణ, పట్టణ ఓటర్లలో కూటమిపై నమ్మకాన్ని పెంచింది.ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం (దీపం): దీపావళి కానుకగా ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రక్రియకు కార్యాచరణ సిద్ధం చేయడం మహిళా ఓటర్లలో సానుకూలత తెస్తోంది. ప్రస్తుతం ఈ పథకం నిధులను ముందుగానే జమ చేయనున్నా.తల్లికి వందనం-ఉచిత బస్సు ప్రయాణం: పాఠశాలలకు వెళ్లే పిల్లల తల్లులకు ఇచ్చే 'తల్లికి వందనం', మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ హామీలపై ప్రజల్లో ఉన్న అంచనాలు కూటమికి కలిసొచ్చే అంశాలు. ప్రస్తుతం ఇవి నిర్విఘ్నంగా అమలవుతున్నాయి.

'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్' - కేంద్ర నిధుల అస్త్రం

కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉండటంతో పాటు.. స్థానిక సంస్థల్లోనూ కూటమిని గెలిపిస్తే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్' గా మారి గ్రామాలకు, నగరాలకు కేంద్ర ఆర్థిక సంఘం నిధులు నేరుగా వస్తాయని కూటమి ప్రచారం చేస్తోంది. ఇది కూడా భారీగానే వర్కవుట్ అవుతుందని అంటున్నారు. ఉపాధి హామీ అనుసంధానం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని స్థానిక అభివృద్ధి పనులకు అనుసంధానించడం, పెండింగ్ బిల్లుల చెల్లింపులు గ్రామీణ ఓటర్లలో పట్టు పెంచుకోవడానికి సాయపడతాయి. ప్రస్తుతం భారీ ఎత్తున గ్రామాల్లో పనులు జరుగుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ ద్వారా వేల మంది లబ్ధి పొందుతున్నారు.అమరావతి, పోలవరం ప్రాజెక్టులు: కేంద్ర ప్రభుత్వం నుంచి అమరావతి రాజధాని నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టుకు లభించిన భారీ ఆర్థిక ప్యాకేజీలను కూటమి అభివృద్ధికి చిహ్నంగా చూపిస్తోంది. ప్రస్తుతం ఆయా ప్రాజెక్టుల పనులు వడివడిగా ముందుకు సాగుతున్నాయి. ఎన్నికల్లో వీటి ప్రభావం కూడా ఉండనుంది.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు

గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను అధికారంలోకి రాగానే రద్దు చేయడం భూయజమానులలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల్లో కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని బలపరిచింది. ఇది ఇప్పుడు కూటమికి సానుకూల ఓటు బ్యాంకుగా మారుతుందని అంచనా వేస్తున్నారు.

బీసీలకు 40% కేటాయింపు

స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ, కూటమి తరఫున 40 శాతం టిక్కెట్లను బీసీలకే కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రకటించారు. ఈ వ్యూహాత్మక నిర్ణయం బీసీ ఓటు బ్యాంకును కూటమి వైపు తిప్పుకోవడానికి పెద్ద ఊతంగా మారుతుందని భావిస్తున్నారు.అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ: పట్టణ, నగర ప్రాంతాల్లో పేద ప్రజలు, కూలీల ఆకలి తీర్చడం కోసం రూ. 5లకే భోజనం అందించే అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించడం మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమికి పట్టణ ఓటర్ల మద్దతు కూడగట్టడానికి ఉపయోగపడనుంది. మొత్తంగా స్థానిక ఎన్నికల్లో కూటమికి సూపర్ సిక్స్ విజయాన్ని తీసుకువస్తుందని అంటున్నారు.

జగన్ కి రాహుల్ గాంధీ ఫోన్ కాల్



అమరావతి,దేశ రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. అంతే కాదు జాతీయ స్థాయి రాజకీయాల ప్రభావం ఏపీ మీద పడబోతోంది అని అంటున్నారు. 2029 ఎన్నికలు టార్గెట్ గా చేసుకుని కాంగ్రెస్ ఈసారి ఎలాగైనా గెలిచి తీరాలని చూస్తోంది. అంతే కాదు ఇండియా కూటమీ పటిష్టంగా చేసుకుంటూనే మరింత మంది మిత్రులను ఆకట్టుకోవాలని చూస్తోంది. అంతే కాదు మాజీ కాంగ్రెస్ నేతలను అందరినీ ఇండియా కూటమి గూటికి తీసుకుని రావాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో ఒక ఆసక్తికరమైన సంచలనమైన ప్రచారం సాగుతోంది. అదేమిటి అంటే జగన్ కి రాహుల్ గాంధీ ఫోన్ చేసే ఆలోచనలో ఉన్నారు అని. ఈ టాక్ అయితే ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలతో పాటు ఢిల్లీ స్థాయిలోనూ పెద్ద ఎత్తున నడుస్తోంది.

జగన్ ని దగ్గరకు తీసుకుని :

ఇండియా కూటమి నేతలు అంతా ఇపుడు ఎన్డీయేతో ఢీ కొడుతున్నారు. దాంతో పాటు ఎన్డీయేకు వైరంగా ఉన్న దూరంగా ఉన్న వారిని తమ వైపు తిప్పుకుంటున్నారు. అదే సమయంలో ఎన్డీయేతో పరోక్షంగా స్నేహం చేసి ఇటీవల కాలంలో కొంత ఎడం పాటిస్తున్న వైసీపీ లాంటి పార్టీలని కాంగ్రెస్ పెద్దలు నిశితంగా పరిశీలిస్తున్నారు. సరైన సమయం ఇదేనని ఇండియా కూటమి వైపుగా వైసీపీని ఆకర్షించాలని కూడా కాంగ్రెస్ అగ్ర నేతలు ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. అందుకే త్వరలోనే రాహుల్ గాంధీ జగన్ కి ఫోన్ చేస్తారు అని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. జగన్ కూడా ఒకనాటి కాంగ్రెస్ నాయకుడే కాబట్టి దగ్గరకు తీసుకుంటే అది పవర్ ఫుల్ రాజకీయ వ్యూహం అవుతుందని కాంగ్రెస్ అగ్ర నాయకత్వం భావిస్తోంది అని అంటున్నారు.

ఎన్డీయేకి గుడ్ బై నా :

ఇక జగన్ విషయం తీసుకుంటే ఆయన ఏనాడూ ఎన్డీయేలో లేరు, ప్రత్యక్షంగా కలిసి ఉన్నట్లు కూడా కనిపించలేదు. కానీ 2014 నుంచి 2019 దాకా కేంద్రంలోని బీజేపీతో ఇండైరెక్ట్ చెలిమి నెరిపారు అన్న ప్రచారం ఉంది. ఆనాడు కేంద్రాన్ని బీజేపీని విమర్శించకుండా ఏపీలో టీడీపీనే టార్గెట్ చేస్తూ వచ్చారు అని గుర్తు చేస్తున్నారు. ఇక 2019 నుంచి 2024 మధ్యలో ఏపీలో వైసీపీ ప్రభుత్వం ఉన్నా కేంద్రంలో ఎన్డీయేకు అన్ని బిల్లులలోనూ మద్దతు ఇచ్చింది అని కూడా తలచుకుంటున్నారు. కేంద్రంతో ఎంతో సాన్నిహిత్యంగా మెలిగిన వైసీపీ 2024 ఎన్నికల తరువాత కూడా మౌనంగా ఉంటే దాదాపుగా అదే వైఖరి కనబరచింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే అనేక బిల్లులకు మద్దతు ఇచ్చింది. అయితే ఇదంతా 2029లో ఏమైనా మార్పు ఉంటుందేమో అన్న ఆలోచనతోనే అని అంటున్నారు.

మారేది లేదుగా :

అయితే 2029 ఎన్నికల్లోనూ ఏపీలో టీడీపీ జనసేన బీజేపీ కలసి పోటీ చేస్తారు అని అంటునారు. ఈ కూటమి బంధం చెక్కు చెదరడం లేదని అంటున్నారు. ఒకరి అవసరాలు మరొకరికి ఉన్నాయని అంటున్నారు. అంతే కాదు బీజేపీని వీడి ఒకసారి తప్పు చేసి 2019లో ఓటమిని కోరి తెచ్చుకున్న టీడీపీ మళ్ళీ అలా చేయాలని అనుకోవడం లేదని అంటున్నారు. ఇక జనసేన కూడా జాతీయ పార్టీ బీజేపీ అంటే ఎంతో ఇష్టమైన మిత్రుడిగా భావిస్తోంది అని అంటున్నారు. కేంద్రంలో బీజేపీకి ఏపీలో ఎంపీలు కావాలి, మిత్రులు కూడా కావాలి. పైగా 2029 టఫ్ ఫైట్ నడుస్తుంది. దాంతో టీడీపీ అధినేత చంద్రబాబుని పవన్ ని వదులుకునే ఉద్దేశ్యం ఏ కోశానా లేదని అంటున్నారు.దాంతో ఎన్డీయే కూటమిగా ఈ మూడు పార్టీలు ఉంటే ఏపీలో వైసీపీ ఒంటరిగా చేసే పోరాటం ఒక ఎత్తు అయితే ఎన్నికల వేళ ఎలక్షనీరింగ్ తో పాటు కేంద్ర సాయం కూడా టీడీపీ కూటమికే సానుకూలం అవుతుంది అన్న చర్చ ఉంది. అందుకే తాము కూడా సేఫ్ జోన్ లో ఉండాలని వైసీపీ భావిస్తోంది అని అంటున్నారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో జగన్ ఇండియా కూటమికి అనుకూలంగా ట్వీట్లు వేస్తున్నారు. కాక్రోచ్ పార్టీకి సపోర్టుగా ఉంటున్నారు. దాంతో ఇండియా కూటమి నుంచి ప్రత్యేకించి కాంగ్రెస్ నుంచి జగన్ కి స్నేహ హస్తం అందవచ్చు అని అంటున్నారు. తొందరలో రాహుల్ గాంధీ జగన్ కి ఫోన్ చేస్తారు అన్న వార్తలు అయితే గట్టిగానే ఉన్నాయి. అదే కనుక జరిగితే ఒక్కసారిగా ఏపీ రాజకీయమే కాదు దేశ రాజకీయాల్లో కీలక మార్పులు సంభవించడం ఖాయమని అంటున్నారు.

షర్మిలకు ఏమైంది?! కీలక సమయంలో వినిపించని వాయిస్



అమరావతి,స్థానిక ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల వైఖరిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. రాష్ట్ర విభజన తర్వాత పూర్తిగా దెబ్బతిన్న కాంగ్రెస్ పార్టీకి దిక్సూచిగా మారి ఆ పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపిన షర్మిల స్థానిక ఎన్నికల వేళ అసలు కనిపించకుండా తిరుగుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన సమయంలో షర్మిల వెనకడుగు వేయడానికి కారణమేంటి? వ్యక్తిగత పనుల్లో బిజీగా ఉండి పార్టీని వదిలేస్తారా? అంటూ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. కీలకమైన స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి షర్మిల సైలెంట్ కావడం కేడర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లుగా చెబుతున్నారు.

ఉనికి కోసం పోరాటం.. ఆపై సైలెంట్!

వైఎస్ షర్మిల రాష్ట్ర కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన తర్వాత పార్టీకి ఒక ఊపు వస్తుందని అంతా భావించారు. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా ఆమె చేసిన విమర్శలు, ఎన్నికల వేళ ఆమె దూకుడు ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించాయి. ఎన్నికల ఫలితాల తర్వాత కూడా కొన్ని కీలక అంశాలపై, ప్రజా సమస్యలపై ఆమె స్పందించిన తీరు కాంగ్రెస్ పార్టీ ఇంకా బతికే ఉందనే సంకేతాలను ఇచ్చింది. అయితే, ఎన్నికల హడావుడి ముగిసిన తర్వాత షర్మిల రాజకీయ కార్యకలాపాల్లో స్పష్టమైన అస్థిరత కనిపిస్తోందనే విమర్శలున్నాయి. తాజాగా ఎన్నికల సంఘం వద్ద నిరసనలు, కొన్ని పరిమిత కార్యక్రమాలు మినహా క్షేత్రస్థాయిలో ఆమె పెద్దగా కనిపించడం లేదని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనా.. ఏపీ కాంగ్రెస్ అధినాయకత్వం వైపు నుంచి ఎలాంటి హడావుడి కనిపించడం లేదని అంటున్నారు. సాధారణంగా స్థానిక ఎన్నికలు అంటేనే పార్టీల బలాబలాలకు అసలైన గీటురాయిగా చెబుతారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసుకోవడానికి, కేడర్‌లో జోష్ నింపడానికి ఇదొక చక్కటి అవకాశంగా భావిస్తారు. కానీ, ఈ కీలక సమయంలో పీసీసీ చీఫ్ షర్మిల పూర్తిగా మౌనం దాల్చడం, అభ్యర్థుల ఎంపికపై లేదా ఎన్నికల సంసిద్ధంగా ఉండేలా కార్యకర్తల తయారీపై దృష్టి పెట్టకపోవడం అనేక సందేహాలకు తావిస్తోందని అంటున్నారు.షర్మిల లాంటి ఫైర్‌బ్రాండ్ లీడర్ నుంచి ఇలాంటి నిరాసక్తతను కేడర్ అసలు ఊహించలేదు. ఎన్నికల్లో గెలుపోటములు పక్కన పెడితే, పోటీలో ఉండి పార్టీ జెండాను నిలబెట్టాల్సిన బాధ్యత అధినాయకత్వాని ఉందని అంటున్నారు. కానీ ఈ సమయంలో ఆమె కనిపించకపోవడం క్యాడర్‌ను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టివేస్తోందని చెబుతున్నారు. స్థానిక సంస్థల్లో పోటీకి దూరంగా ఉండటం ద్వారా సంస్థాగతంగా కాంగ్రెస్‌ను పునరుద్ధరించుకునే మహావకాశాన్ని ఆ పార్టీ చేజేతులా వదులుకుంటోందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. "స్థానిక ఎన్నికల్లో పోటీపై షర్మిలకు అసలు ఆశలు లేవా? లేక పార్టీ వనరుల కొరత, క్యాడర్ లేమితో ఈ ఎన్నికలను లైట్ తీసుకున్నారా? అనే ప్రశ్నలు రాజకీయ పరిశీలకుల నుంచి వస్తున్నాయి.

తెలంగాణలో 5 రోప్‌వేలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



హైదరాబాద్, తెలంగాణలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలో సమర్పించిన ప్రతిపాదనలపై కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ సానుకూలంగా స్పందించింది. ప్రతిష్టాత్మక 'పర్వత మాల' స్కీమ్ కింద దాదాపు రూ.1,230 కోట్ల భారీ అంచనా వ్యయంతో రాష్ట్రంలోని ఐదు ప్రముఖ క్షేత్రాల్లో అత్యాధునిక రోప్‌వేల నిర్మాణానికి పచ్చజెండా ఊపింది.

ఇప్పటికే పురోగతిలో భువనగిరి, ఖమ్మం ఖిల్లా రోప్‌వేలు

రాష్ట్రంలో ఇప్పటికే రెండు చారిత్రక కోటలపై రోప్‌వే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రపంచ ప్రసిద్ధ ఏకశిలా రాతి కోట భువనగిరి ఖిల్లా, చారిత్రక ఖమ్మం ఖిల్లాపైకి రోప్‌వే నిర్మాణ ప్రక్రియ ఇప్పటికే పురోగతిలో ఉంది. ఇప్పుడు కొత్తగా మరో 5 ప్రాజెక్టులు తోడవుతుండటంతో తెలంగాణ పర్యాటక రంగ రూపురేఖలే పూర్తిగా మారిపోనున్నాయి

పర్యావరణహితం, సమయం ఆదా.. రెట్టింపు కానున్న ఆదాయం!

రోప్‌వేల రాకతో కొండ ప్రాంతాల్లో ఘాట్ రోడ్ల ప్రయాణంతో పోలిస్తే సమయం, ఇంధనం భారీగా ఆదా అవుతాయి.అంతేకాకుండా రోప్‌వేల వల్ల ఎలాంటి శబ్ద,వాయు కాలుష్యం ఉండదు.ఈ రోప్‌వే ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే సాహస, ఆధ్యాత్మిక పర్యాటకం విశేషంగా ఊపందుకోవడంతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి వచ్చే టూరిస్టుల సంఖ్య విపరీతంగా పెరుగుతుంది. దీని ద్వారా స్థానికులకు పెద్ద ఎత్తున కొత్త ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు రాష్ట్ర పర్యాటక శాఖకు ఆదాయం రెట్టింపవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మార్నింగ్ వాక్‌లో విషాదం.. డీసీఎం ఢీకొని ఇద్దరు వాకర్ల దుర్మరణం

సూర్యాపేట,జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. జిల్లా కేంద్రానికి సమీపంలోని బలేంల స్టేజీ వద్ద జరిగిన ఈ దుర్ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎప్పటిలానే మార్నింగ్ వాక్‌కు వెళ్లిన వారిని వేగంగా వచ్చిన ఓ డీసీఎం వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బలేంల గ్రామానికి చెందిన గుర్రం సైదులు, ఆలకుంట నాగరాజు, గొల్ల జానయ్య ఈ ఉదయం నడక కోసం రోడ్డుపైకి వెళ్లారు. ఈ క్రమంలో జనగామ వైపు నుంచి సూర్యాపేట వైపు అతివేగంగా వెళ్తున్న డీసీఎం వాహనం వీరిని వెనుక

చిరు వ్యాపారులతో నిరసనకారుల డీల్స్!



న్యూఢిల్లీ,మోడీ సర్కారుపై ఒత్తిడి తీసుకొచ్చేలా.. ఉక్కిరిబిక్కిరి చేసేలా ఎజెండా సెట్ చేస్తున్న సీజేపీ వారికి మద్దతుగా నిలుస్తున్న వామపక్ష.. ఆప్.. కాంగ్రెస్ పార్టీలతో పాటు మరి కొన్ని పార్టీలు కలిసి దేశ రాజధాని దద్దరిల్లేలా నిరసనలు చేపడుతున్న సంగతి తెలిసిందే. దీంతో వ్యాపార కేంద్రాలైన కన్నాట్ ప్లేస్ తో పాటు.. పాలికా బజార్ తదితర ప్రాంతాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాల్లో అత్యధికం మీడియాలో రిపోర్టు కావటం లేదన్న మాట వినిపిస్తోంది. తాజాగా సీజేపీ చేపట్టిన నిరసనకు వ్యతిరేకంగా కన్నాట్ ప్లేస్ వ్యాపారులు ఊహించని విధంగా నిరసన తెలపటమే కాదు.. సీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేయటం తెలిసిందే.ఓవైపు సీజేపీ తీరును నిరసిస్తూ పలువురు వ్యాపారులు వారి తీరును వ్యతిరేకిస్తుంటే.. మరికొన్ని వ్యాపార సంస్థలు న్యాయస్థానాల్ని ఆశ్రయిస్తూ.. నిరసనల కారణంగా తాము తీవ్రంగా నష్టపోతున్నట్లుగా పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే.. మీడియాలో కవర్ కాని కొన్ని ఆసక్తికర అంశాలు ఉండటం గమనార్హం. నిరసనకారులు - చిన్న వ్యాపారుల మధ్య పెరిగిన బంధం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఓవైపు మధ్యస్థాయి..పెద్ద వ్యాపారులు సీజేపీ తీరుతో ఆగ్రహంగా ఉంటే.. చిన్న వ్యాపారులు.. ముఖ్యంగా కేఫ్ లు.. సమోసా, కచోరీ దుకాణాల యజమానులు మాత్రం అందుకు భిన్నంగా ఉండటం ఆసక్తికర అంశంగా చెప్పాలి.సీజేపీ తాజాగా చేస్తున్న నిరసనలు.. ఆందోళనలు మొత్తానికి కేంద్ర బిందువుగా కన్నాట్ ప్లేస్ తో పాటు దాని చుట్టుపక్కల ఉన్న జంతర్ మంతర్, సెంట్రల్ పార్క్.. పార్లమెంట్ స్ట్రీట్ లాంటి ప్రాంతాలే. నిరసనకారులు భారీగా కన్నాట్ ప్లేస్ చుట్టూ ఉండటంతో అక్కడి వ్యాపారుల వ్యాపారాల మీద తీవ్రంగా ప్రభావితం అవుతోంది. కన్నాట్ ప్లేస్, జన్ పథ్ పరిసరాల్లోని కొన్ని చిన్నతరహా రెస్టారెంట్లు.. వీధి వ్యాపారులు ఆరంభంలో నిరసనల్ని.. ఆందోళనల్ని తీవ్రంగా వ్యతిరేకించారు.అయితే.. వీరి నిరసనలు రోజుల తరబడి సాగుతుండటం..పెద్ద ఎత్తున వస్తున్న నిరసనకారుల సమూహాలు వారికి కష్టమర్లుగా మారుతున్న పరిస్థితి. తాము వ్యతిరేకంగా ఉన్న వారి కారణంగా తమ వ్యాపారం మరింత పెరుగుతుండటంతో వారి పట్ల చిన్న వ్యాపారులు సానుకూలంగామారిన పరిస్థితి. దీనికి తోడు నిరసనకారులు స్థానికంగా ఉండే చిన్న వ్యాపారులతో మాట్లాడి.. తమకు అవసరమైన టిఫెన్లు.. టీలు నిరంతరం సరఫరా చేసేలా మాట్లాడుకున్న వైనం ఆసక్తికరంగా మారింది.దీంతో నిరసనల కారణంగా పెద్ద వ్యాపారుల వ్యాపారాలు దెబ్బ తింటే.. చిన్న.. వీధి వ్యాపారుల పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా మారింది. అదే సమయంలో నిరసనకారులతో వీధి వ్యాపారులు అప్రకటిత ఒప్పందాల్ని చేసుకున్న వైనం వెలుగు చూసింది. దీని ప్రకారం వారంలోని ఐదు రోజులు నిరసనకారులు తమ నిరసనలు చేసుకోవచ్చు. కానీ.. తమ ఉపాధికి ఆధారంగా నిలిచే శని.. ఆదివారాలలో మాత్రం ఆందోళనలు చేయకూడదన్న మాటకు సీజేపీ అండ్ కో సానుకూలంగా స్పందించినట్లు చెబుతున్నారు. ఆరెండు రోజులు ప్రశాంతమైన నిరసనలు మాత్రమే చేపడతామన్న ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లుగా తెలుస్తోంది.ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు విధించిన సమయంలో ఆందోళనల్లో పాల్గొంటున్న విద్యార్థుల (వామపక్ష, ఆప్, కాంగ్రెస్, సీజేపీకి చెందిన మద్దతుదారులు) ల్యాప్ టాప్ లు.. ఫోన్లలో డిజిటల్ పోస్టులు పెట్టుకోవటానికి ఇబ్బందుల్ని ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా కొన్నికేఫ్ యజమానులు వారికి ఉచిత వైఫై ను అందించారు. అందుకు ప్రతిగా నిరసనకారులు ఆయా కేఫ్ లకే పెద్ద ఎత్తున ఆర్డర్లు ఇవ్వటం.. గంటల తరబడి ఆయా ప్రాంతాల్లో ఉండటంతో వారి వ్యాపారాలు జోరుగా సాగినట్లుగా తెలుస్తోంది. అయితే.. ఈ అంశాలకు సంబంధించి వార్తలు ప్రధాన మీడియా కవరేజ్ లో కనిపించకపోవటం గమనార్హం.

నంబర్స్ గేమ్‌లో ఎన్డీయే నెగ్గుతుందా ?



న్యూఢిల్లీ,బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ఇపుడు ఒక బిగ్ టాస్క్ ని ఫేస్ చేస్తోంది. పార్లమెంట్ లో రెండు కీలక బిల్లులను ఆమోదించుకోవాలని బీజేపీ చూస్తోంది. అయితే నంబర్లు అనుకూలిస్తున్నాయా లేదా అన్నదే చర్చ. ఎందుకంటె ఏప్రిల్ 17న జరిగిన పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలలో ఎన్డీయే ధీమాగా ప్రవేశపెట్టిన డీ లిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులు అవసరమైన సంఖ్యా బలం లేక వీగిపోయాయి. మళ్ళీ ఆరు నెలల తరువాత పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి మరీ ఈ బిల్లులను నెగ్గించుకోవాలని బీజేపీ పంతం మీద ఉంది. అయితే అది సాధ్యమా అన్నదే ఇపుడు అంతటా సాగుతున్న చర్చ.

మూడింట రెండు వంతులు :

బీజేపీ ప్రతిపాదిస్తున్న రెండు బిల్లులు లోక్ సభలో ఆమోదం పొందాలి అంటే మూడింట రెండు వంతుల సభ్యుల మద్దతు అవసరం. లోక్ సభలో మొత్తం 540 కి పైగా ఎంపీలు ఉంటే అందులో రెండు వంతుల మెజారిటీ సాధించడం అంటే 360 ప్లస్ ఎంపీల మద్దతు అవసరం అని అంటున్నారు. ఇక ఎన్డీయేకు ప్రస్తుతం లోక్ సభలో బలం చూస్తే తృణమూల్ కాంగ్రెస్ నుంచి వచ్చిన ఇరవై మంది ఎంపీలతో కలుపుకుంటే 319కి చేరింది. ఇక డీఎంకేని దారికి తెచ్చుకుంటే ఆ పార్టీ ఎంపీల మద్దతు 22 నంబర్ కలిసి 341 దాకా పెరుగుతుంది. అంటే ఇంకా మరో 20 మంది ఎంపీల మద్దతు అవసరం. అయితే దీని కోసం ఎన్సీపీ శరద్ పవార్ పార్టీ మద్దతుతో పాటు మరిన్ని పార్టీల మద్దతుని బీజేపీ ఆశిస్తోంది. మరి ఈ లెక్కలు అన్నీ సరిపోతాయా బీజేపీకి ఆయా పార్టీలు సానుకూలంగా స్పందిస్తాయా అన్నది అయితే కీలకమైన మౌలికమైన ప్రశ్నగానే నిలిచి ఉంది.

ఊరిస్తున్న మ్యాజిక్ ఫిగర్ :

ఆరు నెలల క్రితం బీజేపీ లోక్ సభలో ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులకు ఈసారి అయినా ఆమోదం కోసం కేంద్రంలోని ఎన్డీయే కూటమి తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అప్పట్లో ఈ బిల్లుల ఆమోదానికి 54 ఓట్ల తక్కువ పడ్డాయి. అంటే ఇది ఇపుడున్న పరిస్థితుల్లో భారీ నంబర్ గానే చూస్తున్నారు. ఎన్డీయే ఇండియా కూటమి ఢీ అంటే ఢీ కొడుతున్న నేపథ్యం ఉంది. దాంతో ఒక్క ఓటు అటు నుంచి ఇటు తిరగడం కూడా కష్టంగా మారుతోంది అని అంటున్నారు ఈ నేపథ్యంలో ఎన్డీయే ఎంతగా తన బలాన్ని పెంచుకున్నా దగ్గరకు వచ్చి ఆగిపోతే మరోసారి అభాసుపాలు అవుతుందా అన్న చర్చ సాగుతోంది.

ఆకట్టుకునే ఫార్ములా :

అన్ని పార్టీలను అందరినీ ఆకట్టుకునేలా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను ఏకరీతిగా యాభై పెంచేలా బీజేపీ కొత్త ఫార్ములా రచిస్తోంది. అంటే మొత్తం సీట్లు 543 నుండి 816కి పెరిగేలా బిల్లులో స్పష్టమైన లిఖితపూర్వక హామీ ఇస్తే మద్దతు ఇచ్చేందుకు ఎన్‌సీపీ శరద్ పవార్ వంటి పార్టీలు సుముఖత వ్యక్తం చేస్తున్నాయి. అలాగే తమిళనాడు అధికార పార్టీ డీఎంకే కూడా ఈ బిల్లుపై సానుకూల నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే ఊహాగానాలు వస్తున్నాయి. అలా లోక్ సభలో బిల్లు గట్టెక్కించేందుకు ఎన్డీయే మార్గాలు వెతుకుతోంది.

రాజ్యసభలో మ్యాజిక్ ఫిగర్ :

కేవలం లోక్ సభలోనే కాదు రాజ్యసభలోనూ ఈ బిల్లు మూడింట రెండు వంతుల ఎంపీల మద్దతుతో నెగ్గాలి. అక్కడ చూస్తే మ్యాజిక్ ఫిగర్ 164గా ఉంది. రాజ్యసభలో ఎన్డీయే బలం దాదాపు 150 కి చేరింది. డీఎంకేకు చెందిన 8 మంది ఎంపీల మద్దతు లభిస్తే ఈ సంఖ్య 158 కి చేరుతుంది. తృణమూల్ ఎంపీల రాజీనామాలతో ఖాళీ అయిన స్థానాలలో ఉప ఎన్నికలు జరిగితే బలం ఇంకా పెరుగుతుంది. చిన్న పార్టీల మద్దతుతో రాజ్యసభలో 2/3వ వంతు మార్కును దాటడం ఎన్డీఏకు పెద్ద కష్టం కాకపోవచ్చు అని అంటున్నారు. అలా అన్ని రకాలుగా అస్త్రాలను వ్యూహాలను రెడీ చేసుకుని పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తే ఎన్డీయే ఈసారి నెగ్గేందుకు చూస్తోంది అని అంటున్నారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140